జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన
నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?
మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది
వివరాలకు సంప్రదించండి 8886022523

సంపుటి 7 సంచిక 63 | హైదరాబాద్, మే 10 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00

# వీఆర్ఏలకు ప్రభుత్వ పేస్కేల్

## వచ్చే విధంగా చర్యలు తీసుకోండి.. సీఎం కేసీఆర్ ఆదేశం



హైదరాబాద్ :వీఆర్ఏలను ఇతర ప్రభుత్వ శాఖల్లో సర్దుబాటు చేయడం ద్వారా వారికి రెగ్యులర్ స్కేల్ వచ్చే విధంగా తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల లోపు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఈ విషయం పై కేబినేట్ లో నిర్ణయం తీసుకున్న అనంతరం వీఆర్ఏ జేఏసి ప్రతినిధులను తన ఛాంబర్ కు పిలిపించుకుని సీఎం వారితో చర్చించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసేదే పేద ప్రజల కోసమని, చిరుద్యోగులైన విఆర్ఏల సమస్యలను మానవత్వంతో వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నదని సీఎం పేర్కొన్నారు. సుమారు 20 వేల మంది ఉన్న వీఆర్ఏ లలో ముందుగా మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ ప్రకారం అర్హులై దరఖాస్తున్న చేసుకున్న వారి వారసుల వివరాలు, వారి విద్యార్హతలు సేకరించాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. మిగతావారిని వారి అర్హతల ఆధారంగా మున్సిపల్, ఇరిగేషన్ (లష్కర్స్), రెవెన్యూ, జెడ్ పి, ఎడ్యుకేషన్, మెడికల్ కాలేజీలు, మిషన్ భగీరథ తదితర అవసరమైన శాఖల్లో స్కేల్ ఇస్తూ, తదుపరి ప్రమోషన్ వచ్చే విధంగా వారిని సర్దుబాటు చేయాలని సీఎం కేసీఆర్ రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్ ను ఆదేశించారు. ఈ విషయంలో వీఆర్ఏ లు సమాచారం ఇవ్వడం సహా, అన్ని విషయాల్లో సమన్వయం చేయాలని ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డికి సూచించారు. ముందుగా మొత్తం సమాచారాన్ని అధికారులకు అందజేయాలని, విఆర్ఏ జెఏసి ప్రతినిధులకు సూచించారు. విఆర్ఏలలో వారి విద్యార్హతలను బట్టి వారికి నచ్చిన ప్రభుత్వ శాఖలను ఎంచుకునే అవకాశం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

### ప్రతి వీఆర్ఏ కుటుంబం కేసీఆర్‌కు రుణపడి ఉంటుంది : వీఆర్ఏల అసోసియేషన్



రాష్ట్రంలోని వీఆర్ఏలను క్రమబద్ధీకరించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించడం పట్ల వీఆర్ఏల అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వీఆర్ఏల ప్రతినిధులు కలిశారు. క్రమబద్ధీకరణ నిర్ణయంపై కేసీఆర్‌కు వీఆర్ఏలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సచివాలయంలోని మీడియా పాయింట్ వద్ద వీఆర్ఏల అసోసియేషన్ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. తమ ఉద్యోగాల క్రమబద్ధీకరణ విషయంలో ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా క్రమబద్ధీకరణ వార్త చెప్పడం సంతోషంగా ఉందన్నారు. రేపు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ప్రతి వీఆర్ఏ కుటుంబం కేసీఆర్‌కు రుణపడి ఉంటుంది. ఇవాళ ఇంత పెద్ద నిర్ణయం తీసుకోవడం మరిచిపోలేని విషయం అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్ఏల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తుందని ప్రతినిధులు పేర్కొన్నారు.

# కర్ణాటక సీఎంగా ...
# రేపు సిద్ధారామయ్య ప్రమాణం

## కేసీఆర్, జగన్‌లకు అందని ఆహ్వానం..!



కర్నాటకలో శనివారం నాడు సిద్దరామయ్య కేబినెట్ కొలువు తీరబోతోంది. డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం చేయబోతున్నారు. పలువురు విపక్ష నేతలకు ప్రమాణస్వీకారోత్సవానికి ఆహ్వానం అందింది. అయితే, పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్‌కు మాత్రం ఆహ్వానం అందలేదు. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

(మిగతా 7లో..)

# నేటి నుంచి మోదీ విదేశీ పర్యటన..

## 6 రోజుల్లో 3 దేశాలు చుట్టేయనున్న పీఎం..



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. శుక్రవారం నుంచి ఆయన పర్యటన ప్రారంభం కానుంది. 6 రోజుల్లో మూడు దేశాల సందర్శించనున్నారు. జపాన్, పాపువా న్యూ గినియా, ఆస్ట్రేలియా దేశాల్లో సుడిగాలి పర్యటన చేస్తారు ప్రధాని మోదీ. క్వాడ్ సదస్సు రద్దైనా ఆస్ట్రేలియా సందర్శించాలని నిర్ణయించుకున్నారు ప్రధాని. దాదాపు 25 మందికి పైగా ప్రపంచ నాయకులతో భేటీ కానున్నారు. ఇక విదేశీ పర్యటనలో భాగంగా 40 కార్యక్రమాల్లో పాల్గొననున్నారు ప్రధాని మోదీ. ప్రధాని పర్యటన సంపూర్ణం, చారిత్రాత్మకమని పీఎంవో అభివర్ణించింది. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.. మూడు దేశాల పర్యటన కోసం ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం నాడు ఢిల్లీ నుంచి బయలుదేరుతున్నారు. ముందుగా జపాన్‌లోని హిరోషిమాలో జరిగే జి7 సమావేశంలో పాల్గొంటారు. కీలకమైన జి7 గ్రూప్‌లో భారత్ సభ్య దేశం కానప్పటికీ అతిధి దేశంగా పాల్గొనాలని జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా ఇండియాను ఆహ్వానించారు. జి7 గ్రూప్‌కు ప్రస్తుతం జపాన్ అధ్యక్షత వహిస్తోంది. జి7 గ్రూప్‌లో ప్రధాని మోదీ పాల్గొనడం ద్వారా జి7, జి20 దేశాల మధ్య బంధం బలపడుతుందని జపాన్ భావిస్తోంది.మరో వైపు ఆస్ట్రేలియాలో ఈ నెల 24న జరగాల్సిన క్వాడ్ సదస్సు వాయిదా పడటంతో హిరోషిమాలోనే క్వాడ్ దేశాధినేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని భారత్ భావిస్తోంది. జపాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ పాపువా న్యూ గినియా దేశాన్ని సందర్శిస్తారు. భారత ప్రధాని ఒకరు పాపువా న్యూ గినియా దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. అక్కడ ఇండో-పసిఫిక్ దీవుల సహకార ఫోరమ్ మూడో శిఖరాగ్ర సదస్సుల్లో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఈ ఫోరమ్‌ను 2014లో ఏర్పాటు చేశారు. పసిఫిక్ మహాసముద్రంలో 14 దీవులు, దేశాలు సభ్యులుగా ఉన్నాయి.

# హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ సంస్థ..

## హర్షం వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్: మరో అంతర్జాతీయ సంస్థ రానుంది. హైదరాబాద్ నగరంలో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆక్యుజెన్ సంస్థ ప్రకటించింది. న్యూయార్క్ పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో ఆక్యుజెన్ ప్రతినిధులు సమావేశమై ఈ విషయాన్ని ప్రకటించారు.ఆక్యుజెన్ సంస్థ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఆక్యుజెన్ పరిశోధన కేంద్రం లైఫ్ సైన్సెస్ రంగంలో కీలకం అవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ రంగాన్ని 250 బిలియన్ డాలర్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేటీఆర్ వివరించారు. 250 బిలియన్ డాలర్ల సాధనలో ఆక్యుజెన్ నిర్ణయం కీలకమని కేటీఆర్ స్పష్టం చేశారు.

వీఆర్ఏల క్రమబద్ధీకరణ, కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం..

2లో..

# కర్ణాటక జోష్‌తో కాంగ్రెస్ కొత్త స్కీమ్..

## ఘర్‌వాపసీ పేరుతో ఓపెన్ ఇన్విటేషన్..



ఎన్నికలు సమీపిస్తోన్న వేళ ఇప్పుడు కాంగ్రెస్ కొత్త పాట అందుకుంది. కర్నాటక జోష్‌తో కంగ్రెస్‌లోకి రారండోయ్ వేడుక చేద్దాం..అంటోంది. అవును, కన్నడ నాట కాంగ్రెస్ విజయం ఆ పార్టీలో అంతులేని జోష్‌ని నింపుతోంది. కేసీఆర్‌పై వ్యతిరేకతతో.. బీజేపీలో చేరిన వాళ్లని తిరిగి కాంగ్రెస్‌లోకి రమ్మంటూ రేవంత్ రెడ్డి బహిరంగ ఆహ్వానం ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.వివేక్, విశ్వేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి రాజగోపాల్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావులకు ఓపెన్ కాల్ చేశారు రేవంత్ రెడ్డి. వీళ్ళంతా కేసీఆర్‌ని ఓడిస్తారన్న ఆశతోనే బీజేపీలో చేరారనీ.. కానీ కాంగ్రెస్ తల్లిలాంటిదనీ.. లేచిపోయినా తిరిగి అక్కున చేర్చుకుంటుందంటూ రేవంత్ రెడ్డి బీజేపీలోని వారికి ఆహ్వానం పలికారు.మరో ఆరు నెలల్లో ఎన్నికలున్న నేపథ్యంలో కేసీఆర్‌ను వ్యతిరేకించే వాళ్ళంతా కాంగ్రెస్‌లోకి రావాలంటూ పిలుపునిచ్చారు రేవంత్. కేసీఆర్ వ్యతిరేక పునరేకీకరణ నినాదాన్నిస్తూ చేతిలో చెయ్యేసి చెపుతున్నా బావా అని రేవంత్ రెడ్డి అంటుంటే.. వామ్మో కాంగ్రెస్సా అంటూ హడలిపోతున్నారు నేతలు. కర్నాటక విజయంతో నన్ను ఆహ్వానించిన మాట వాస్తవమే.. కానీ నేనేం చెప్పలేదే.. అంటూ తడుముకున్నారు రాజగోపాల్ రెడ్డి. ఇక ఆయన సోదరుడు కోమటిరెడ్డి సీఎం రేసులో లేనని స్పష్టం చేశారు. మంత్రి పదవినే వదిలిపెట్టిన నా లాంటి వాడికి ముఖ్యమంత్రిపదవెందుకు? అని ప్రశ్నించారు కోమటిరెడ్డి. బీఆర్ఎస్‌లో కేసీఆర్ తరువాత కాంగ్రెస్ పరిస్థితేంటని సూటిగా ప్రశ్నించారు.క్షణికావేశంలో నిర్ణయం తీసుకున్నవాళ్ళు మళ్లీ పార్టీలోకి రావాలన్న రేవంత్ వ్యాఖ్యలపై స్పందించారు ఈటెల రాజేందర్. తాము క్షణికావేశంలో లేమనీ.. ఇక్కడెవరూ నారాజ్‌గా లేరనీ తేల్చి చెప్పారు. ఇవన్నీ కట్టుకథలంటూ కొట్టిపారేశారు. బీజేపీని వీడేది లేదని తేల్చి చెప్పారు ఈటెల. మొత్తం మీద కర్నాటక జోష్‌తో కాంగ్రెస్ కొత్తగా స్కీమ్ మొదలెట్టింది. ఘర్‌వాపసీతో.. పోయినోళ్ళందర్నీ.. తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకునేందుకు తహతహలాడుతోంది. నన్ను తిట్టినా దులిపేసుకుంటాకానీ.. మా పార్టీలోకి రారమ్మని ఆహ్వానిస్తున్నారు టీపీసీసీ చీఫ్.

ఆహ్వానం
మాస్టర్ కీ TV
Jai B Bhoomi News Channel Limited
CIN NO: U74999TG2018PLC128263
మాస్టర్ కీ టీవీ సమావేశం
20 మే 2023, సాయంత్రం గం. 6.00 ల నుండి గం. 8.30 ల వరకు
అడ్రస్: షోయబుల్లాఖాన్ ఏ సి హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.
ఎజెండా
బోర్డు డైరెక్టర్లు
డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన్, IRS-vrs
చైర్మన్ మాస్టర్‌కీ టీవీ ఛానెల్
వివరాలకు:
1) T. అరుణ కుమారి - 9154958315, 2) P. సరిత - 7660027683.

# మీ తరపున....సీఎంతో మాట్లాడుతం..

## కొట్లాడుతం...సమస్య సాధించే వరకు వదిలిపెట్టం

## జర్నలిస్టుల ఇండ్లస్థలాల కోసం మహాధర్నాలో తమ్మినేని

## కాంగ్రెస్, వైస్సార్టీపీ, టీజేఎస్, సీపీఐ, బీయస్పీ మద్దతు







మంచిర్యాల బ్యూరో ( హైదరాబాద్,) మే 18, ప్రజాపాలన: మీ తరపున సీఎంతో మాట్లాడుతం... కొట్లాడుతం...ఇండ్ల స్థలాల సమస్య సాధించే వరకు వదిలిపెట్టం. సమస్య పరిష్కారానికి రాజకీయ పార్టీలు, బాహ్యశక్తుల మద్దతు కొంత వరకు సమస్యను సాధించడంలో తోడ్పడుతుంది. అది మాత్రమే సరిపోదు. జర్నలిస్టులు ఐక్య పోరాటంతోనే సమస్యను సాధించగలరు. రాబోయే కాలంలో ఈ పోరాటాన్ని కొనసాగించాలి. సీపీఐ(ఎం) మీ పక్షాన నిలబడు తుంది. ఇది ఎన్నికల సంవత్సరం. ఊరించడానికి కొంత మందికైనా ఇచ్చే అవకాశ ముంది..... అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కార్యదర్శి బసవ పున్నయ్య అధ్యక్షతన గురువారం హైదరాబాద్ లోని ధర్నాచౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, సీపీఐ(ఎం), వైఎస్సార్టీపీ, టీజేఎస్, బీయస్పీ పార్టీలు సంపూర్ణ మద్ధతు తెలిపాయి. సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సీపీఐ (ఎం) రాష్ట్ర కమిటీ తరపున జర్నలిస్టుల ఇండ్ల స్థలాల డిమాండ్ కు సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్టు ప్రకటించారు. ఆయుధాలతో హింసావాదం వస్తే, రక్తపాతం లేకుండానే భావ విప్లవాన్ని సాధించింది జర్నలిస్టులేనని కొనియాడారు. ప్రభుత్వాలనే మార్చగలిగిన శక్తి కలిగిన జర్నలిస్టులు అవే ప్రభుత్వాలను ఇండ్ల స్థలాల కోసం అడిగే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత సీఎం కేసీఆర్ తో తాము కలిసిన సమయంలో 20 డిమాండ్లను చేశామనీ, అందులో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల డిమాండ్ ఉందని తెలిపారు. దానికి సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. మరో సందర్భంలో ఖమ్మం బీఆర్ఎస్ ఆవిర్భావ సభలో సీఎం కేసీఆర్ కు మౌఖికంగా ఈ విషయాన్ని గుర్తు చేస్తే అదే సానుకూలతను మాటల్లో కనబరిచినా అమలు చేయలేదని విమర్శించారు.

**గతంలో ఇచ్చాం...మళ్లీ అధికారంలో వచ్చాక ఇస్తాం...**

గతంలో అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ జర్నలిస్టులకు ఇండ్ల కోసం స్థలం కేటాయించిందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, మీడియా ఇన్ ఛార్జి చామల కిరణ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. మళ్లీ అధికారం లోకి వచ్చాక జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలిస్తామనీ, ఈ అంశాన్ని మ్యానిఫెస్టోలో పొందుపరుస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉండే జర్నలిజాన్ని సీఎం కేసీఆర్ బతుకనియ్యడం లేదని విమర్శిం చారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై జర్నలిస్టుల పోరాటం కొనసాగించాలనీ, కాంగ్రెస్ పార్టీ పోరాటానికి అండగా ఉంటుందని తెలిపారు.

**మ్యానిఫెస్టోలో పెడతాం...షర్మిల**

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల డిమాండ్ ను వైఎస్సార్టీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పెడతామని ఆ పార్టీ అధ్యక్షురాలు షర్మిల హామీ ఇచ్చారు. సాధించుకున్న బంగారు తెలంగాణలో తమ కనీస అవసరాలు తీర్చమని జర్నలిస్టులు ధర్నా చేస్తున్నారంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దౌర్భాగ్యమైందో అర్థమవుతుందని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి జవహర్ లాల్ నెహ్రూ హౌజింగ్ సొసైటీ పేరుతో 70 ఎకరాలను కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం వైఎస్సార్ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలో కొనసాగిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో పాటు సీఎం కేసీఆర్ జర్నలిస్టులను పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ జిల్లా ఆ జిల్లా మాట, ఏ పూటకు ఆ మాట అన్న చందంగా, జర్నలిస్టుల సమస్యలన్ని తనకు లోతుగా అర్థమైనట్టుగా నమ్మబలికిన కేసీఆర్ హామీ నెరవేర్చలేదని విమర్శించారు. జర్నలిస్టులు చేసే ప్రతి పోరాటంలో వైఎస్సార్టీపీ భాగస్వామి అవుతుందని తెలిపారు.

**సంఘటిత పోరాటంతోనే సాధ్యం...కోదండరాం**

సంఘటిత పోరాటంతోనే జర్నలిస్టులు ఇండ్ల స్థలాలను సాధించుకోగలుగుతారని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. రాష్ట్రంలో స్థలాలున్నప్పటికీ....జర్నలిస్టులకు మాత్రం ఇవ్వడం లేదని తెలిపారు. మీడియా యాజమాన్యాలను జేబులో పెట్టుకున్న బీఆర్ఎస్ సర్కారు జర్నలిస్టులతో తమకు అవసరం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.

## నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్**



మంచిర్యాల బ్యూరో, మే 18, ప్రజాపాలన : జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యతో కలిసి ఇటీవల విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదివి అత్యున్నత మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను సత్కరించి, వారితో కలిసి కేక్ కట్ చేసి తాను స్వయంగా తయారు చేసిన బహుమతులను విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నాణ్యమైన ఫలితాల సాధనకు కృషి చేసి విద్యార్థులను ప్రోత్సాహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల కృషి మరువలేనిదని అన్నారు. జిల్లాలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవితానికి 10వ తరగతి తొలిమెట్టు మాత్రమేనని, ఇంకా సాధించవలసినవి ఎన్నో ఉంటాయని, అనుకున్న లక్ష్యాలు సాధించే వరకు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, కో-ఆర్డినేటర్లు సప్తర్ అలీఖాన్, సత్యనారాయణమూర్తి, కుమారస్వామి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా బూర్ల వెంకటేష్



శంకరపట్నం మే 18 ప్రజాపాలన రిపోర్టర్: తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామానికి చెందిన జర్నలిస్ట్ బూర్ల వెంకటేష్ ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మైలారపు ప్రేమ్ కుమార్ తెలియజేశారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్ర విజయ శంకర్, జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ కి వెంకటేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వెంకటేష్ తెలియజేశారు. ఈ నియామకం మే 18 నుండి అమలవుతున్నట్టుగా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తెలియజేశారు.

## కెసిఆర్ రైతులకు ఇచ్చిన హామీలు నీటి మూటలై రైతులను బలి తీసుకుంటున్నాయి....



మధిర, ప్రజాపాలన ప్రతినిధి: వ్యవసాయాన్ని పండుగలా చేసుకుంటాం అన్న కెసిఆర్ గారు రైతులకు ఇచ్చిన హామీలు నీటి మూటలై రైతులను బలి తీసుకుంటున్నాయి.... మార్చి 23 వ తారీఖున బోనకల్ మండలంలో పర్యటించిన కెసిఆర్ గారు పంట నష్టపోయిన రైతులను పరామర్శించి వారికి తక్షణమే ఎకరాకు 10000 రూపాయలు జమ చేస్తాం అని చెప్పి వెళ్లారు. కానీ ఇంతవరకు అవి జమ చేయలేదు.... తక్షణమే అంటే మీ దృష్టిలో ఎన్ని రోజులు గౌరవ కెసిఆర్ గారూ..నెల రోజులా... రెండు నెలలా... లేదా సంవత్సరమా... ఎన్ని రోజులకు ఆ రైతులకు 10000 రూపాయలు జమ ఔతాయి... కెసిఆర్ గారు పర్యటించి వెళ్లిన తర్వాత పడిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటలను కూడా సర్వే చేసి వారికి కూడా నష్టపరిహారం అందించాలి... అలాగే కెసిఆర్ గారు ప్రకటించినట్లు ఎకరాకు 10000 రూపాయలు కాదు పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు డిమాండ్ చేసినట్లు ఎకరాకు 30000 రూపాయలును నష్టపోయిన ప్రతి రైతుకూ ప్రభుత్వం ఇవ్వాలి.... ఈ నెల 6 వ తారీఖున పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు ఖమ్మం లో రైతన్నల కోసం నూతన కలెక్టర్ కార్యాలయం వరకు మండుటెండలో దాదాపు 5 కిలో మీటర్లు రైతు భరోసయాత్ర చేసుకుంటూ వెళ్లి కలెక్టర్ గారికి ఇచ్చిన డిమాండ్స్ ఏమయ్యాయి...కల్లాల్లో ఉన్న ప్రతి గింజను ప్రభుత్వమే కొంటది అని కెసిఆర్ గారు అన్నారు. కానీ అకాల వర్షాలకు కల్లాల్లో ఉన్న గింజలు అన్ని తడిచిపోయి నీటిపాలు అయిపోయి మొక్కలు కూడా రావడం జరిగింది.... మొక్కజొన్న గింజలు కొంటాం అని అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ క్వింటాకు 10 కేజీలు తరుగు తీసి కొనడం వల్ల రైతులు ఇంకా నష్టపోతున్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువలో ఎక్కువ 4 కిలోలు తరుగు తీసేవారు ఇప్పుడు ఎంత తరుగు తీస్తున్నారు అని ఇప్పటి ప్రభుత్వం తెలుసుకోవాలి....రైతుబంధు ఎకరాకు 5000 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకొని రైతులకు అందాల్సిన సబ్సిడీలు అన్ని ఎత్తివేశారు. ఎన్ని లక్షలు మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం అయితే అన్ని ఎరువులు ఫ్రీ గా ఇస్తాం అని అన్నారు. కానీ ఇప్పటివరకు ఎంత ఇచ్చారు... 24 గంటలు రైతులకు ఉచిత విద్యుత్ అని అన్నారు. కానీ ఆ ఉచిత విద్యుత్ తో పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయడం లేదు.... రైతులు ఆత్మహత్యలు లేవు అని మీరు అన్నరోజే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకొని చనిపోయారు. ఇలాంటి మోసపు హామీలతో రైతులను ఇంకెన్నాళ్ళు మోసం చేస్తారు అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారి ప్యానెల్ తరపున ప్రశ్నిస్తున్నాం.... ఈ ప్రెస్ మీట్ లో దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, యర్రగుంట రమేష్, ఉప సర్పంచ్ కాశీ కోటేశ్వరరావు, ఐలూరి జనార్ధన్ రెడ్డి, బండి వెంకటేశ్వర్లు, అమరవాది సత్యనారాయణ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, కపిలవాయి సత్యనారాయణ రాజు, గూడూరు సత్యనారాయణ రెడ్డి, గోళ్ళ ఉద్ధండు, నంద్రు విజయారావు, బాహాటం శ్రీనివాస్ రాజు, అక్కినపల్లి నాగేశ్వరరావు, వీరంశెట్టి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు....

## హిమాయత్ నగర్ తహశీల్దార్ మల్లేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఇనుగాల భీమారావు



హైదరాబాద్: హిమాయత్ నగర్ తహశీల్దార్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్పిఆర్ మల్లేష్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో మల్లేష్ కుమార్కు హైకోర్టు అడ్వకేట్, రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగాల భీమారావు శుభాకాంక్షలు తెలియచేసారు. తెలంగాణ రాష్ట్ర తహశీల్దార్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యత గల మల్లేష్ కుమార్ గతములో ఆసిఫ్‌నగర్, చార్మినార్ మండలాల్లో తహశీల్దార్గా విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతు వివిధ సమస్యలపై తమ కార్యాలయాన్ని సందర్శించే ప్రతీఒక్కరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండ చూస్తామని, సంబంధంచిన సర్టిఫికెట్లు సకాలములో అందించెలా చర్యలు తీసుకుంటానని అన్నారు. భీమారావు వెంట దళిత నాయకులు రాయపాటి రవి, దుర్గం మోహన్ లున్నారు.



## రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..: డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి, ప్రజాపాలన ప్రతినిధి:సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా రెండవసారి ఎన్నికైన నిర్మలజగ్గారెడ్డి ని సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.... వచ్చే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రాష్ట్రంలో వచ్చేది మా ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రాజీవ్ గాంధీ క్విజ్ కాంపిటీషన్ పోస్టర్ ను ఆమె విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంత కిషన్, నాయకులు రాంరెడ్డి, గాలి అనిల్ కుమార్, జార్జి, కూన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల క్రమబద్ధీకరణ, కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం.. మరెన్నో కీలకమైన నిర్ణయాలు తీసుకున్న కేబినేట్



హైదరాబాద్: తెలంగాణ వచ్చి పది సంవత్సారాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రంలో దశాబ్ది ఉత్సవాలను 21 రోజులపాటు ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మంత్రివర్గం నిర్ణయించింది. సీఎం కేసీఆర్ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో తొలిసారి మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేబినెట్ తీసుకున్న పలు కీలక నిర్ణయాలను మంత్రి హరీశ్‌రావు మీడియా సమావేశంలో వెల్లడించారు. కులవృత్తులను నమ్ముకున్నవారికి ఆర్థికంగా చేయూత అందించేందుకు విధి విధాలను రూపొందించాలని బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్‌కి సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు తెలిపారు. ఒక్కో లబ్ధిదారునికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించే విధంగా పథకం రూపకల్పన చేయాని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు. అలాగే 111 జీవోను పూర్తిగా ఎత్తివేస్తున్నట్లు కేబినేట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఈ జీవో పరిధిలో ఉన్న 84 గ్రామాల ప్రజలు అభివృద్ధి లేక ఎన్నో ఏళ్లుగా ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. వీరికే మేలు చేసే విధంగా కేసీఆర్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న గ్రామాలకు ఎలాంటి విధానాలు ఉంటాయెూ వారికి కూడా అవే నిబంధనలు వర్తిస్తాయని చెబుతున్నారు.అలాగే కాళేశ్వరం జలాలతో హిమాయత్‌సాగర్, గండిపేట అనుసంధానానికి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్‌తో గోదావరి జలాలను అనుసంధించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 38 డీఎంహెచ్ఓ పోస్టులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 40 మండలాలకు పీహెచ్‌సీలను మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో శాశ్వత ఉద్యోగుల నియామకానికి కూడా ఆమోదముద్ర వేశామన్నారు. వ్యవసాయ రంగంలో పలు మార్పులు తెచ్చేందుకు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేస్తూ మంత్రి వర్గం నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీఆర్ఏల క్రమబద్దీకరణకు సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని.. వివిధ విభాగాల్లో వారిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సుమారు 20 వేల మంది ఉన్న విఆర్ఏలలో ముందుగా మెడికల్ ఇన్ వ్యాలిడేషన్ ప్రకారం అర్హులై దరఖాస్తున్న చేసుకున్న వారి వారసుల వివరాలు, వారి విద్యార్హతలు సేకరించాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. మిగతావారికి వారి అర్హతల ఆధారంగా మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, జెడ్‌పీ, ఎడ్యుకేషన్, మెడికల్ కళాశాలలు, మిషన్ భగీరథ తదితర అవసరమైన శాఖల్లో స్కేల్ ఇస్తూ, తదుపరి ప్రమోషన్ వచ్చే విధంగా వారిని సర్దుబాటు చేయాలని రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్ ను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. అలాగే రెండో విడత గొర్రెల పంపిణీ 15 రోజుల్లో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. వనపర్తి జర్నలిస్టు అసోసియేషన్‌కు 10 గంటల స్థలం కేటాయిస్తామని అలాగే ఖమ్మంలోని జర్నలిస్టుల ఇళ్ల కోసం 23 ఎకరాలు స్థలం కేటాయింపు చేసినట్లు తెలిపారు. మైనార్టీ కమిషన్‌లో జైన్ కమ్యూనిటీని కలపాలని, కమిషన్ సభ్యుల్లో ఒకరికి అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అలాగే టీఎస్‌పీఎస్సీలో 10 పోస్టుల మంజూరు చేసినట్లు వెల్లడించారు.

## ఎస్‌బిఐ బ్యాంకులో మంటలు



లక్షెట్టి పేట్, మే18, ప్రజాపాలన: లక్షెట్టిపేట్ పట్టణ పురపాలక పరిధిలోని ఊత్కూర్ చౌరస్తాలో గల ఎస్ బి ఐ బ్యాంకులు లో గురువారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి ఫైర్ సేఫ్టీ అలారం మొగడం తో అటుగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ఫైర్ అధికారులకు, బ్యాంకు సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో బ్యాంక్ సిబ్బంది వచ్చి సేటర్ తెరిచి స్టేషనరీ రూములో వస్తున్న మంటలను అర్పివేశారు. ఈ సంగటనలో విత్ డ్ర డిపాసిట్ వోచర్లు మాత్రమె కాలిపోయాయ పి, ముఖ్యమైన రికార్డులు ఇతరత్రా సమగ్రి భద్రంగానే ఉందని బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం లో ఎటువంటి నష్టం జరగలేదని మంచిర్యాల రీజినల్ ఎస్ బి ఐ మేనేజర్ సంజయ్ కుమార్ సాహు తెలిపారు. ఇదిలా ఉండగా మంటలు ఎలా వచ్చాయనే దానిపై పోలిసులు దార్యాప్తు చేస్తున్నారు.

## పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రమేష్



జన్నారం, మే 18, ప్రజాపాలన: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గల పశు వైద్య కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా పశు సంవర్ధక శాఖా అధికారి డాక్టర్ వై రమేష్ కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా పశు వైద్య కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి యాదవులకు రెండవ విడత గొర్రెల, మేకల పంపిణీ కి సంబంధించి, సమాచార వివరాలను మండల పశు వైద్యాధికారి శ్రీకాంత్ ను, అడిగి తెలుసుకోన్నారు. వేసవిలో పశు వుల, గొర్రెల మ్యాకల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. ప్రభుత్వం అందించే పథకాలను రైతులకు యాదవులకు తెలియజేయాలన్నారు.

## కృష్ణాపురం గ్రామంలో సి.సి రోడ్ శంకుస్థాపన



మధిర, మే 18 ప్రజా పాలన ప్రతినిధి: నియోజకవర్గ శాసనసభ్యులు, శాసనసభ పక్ష నేత మల్లు భట్టివిక్రమార్క కృషితో మధిర మండలం కృష్ణాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మూడు లక్షల రూపాయలతో మంజూరు అయిన సీసీ రోడ్ గురువారం శంకుస్థాపన చేయటం జరిగింది.. గ్రామంలో పాశ్యం కృష్ణ ఇంటి వద్ద నుండి సాంబత్తిని వెంకటరత్నం ఇంటి వరకు మంజూరు అయిన సీసీ రోడ్ కు మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిసూరంసెట్టి కిశోర్లి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లిబుర్రి సునీత బాబులి మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లిదారా బాలరాజులి సైదల్లిపురం సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి గ్రామ మాజీ సర్పంచ్ లికర్నాటి రామారావులి గ్రామ శాఖ అధ్యక్షులు లిపోచేపల్లి శంకర్రావులి సీనియర్ కాంగ్రెస్ నాయకులు లివేల్పుల చెంచయ్యలి రొంపి మల్ల సర్పంచ్ లిఎస్.కె మదర్ సాహెబ్లి లిపాశ్యం కృష్ణలి లిసాంబత్తిని వెంకటరత్నంలి లిబుర్రి నాగరాజు దుగ్గి ఏసురత్నం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ జవాన్ పై ఆగ్రహం వ్యక్త చేసిన మునిసిపల్ చైర్ పర్సన్ మొండితోక లత



మధిర, మే 18 ప్రజా పాలన ప్రతినిధి: మున్సిపాలిటీ పరిధిలో ఇల్లేందులపాడు సమీపంలో ఆర్ అండ్ బి రోడ్ ఇరువైపులా చెత్తను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శానిటేషన్ సిబ్బంది పిలిపించి ఆవరణను శుభ్రం చేయించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి పెట్టాలని చైర్పర్సన్ మొండితోక లత సూచించారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సిపిఎం పార్టీ నాయకులు



ఇబ్రహింపట్నం మే తేది 18 ప్రజాపాలన ప్రతినిధి మంతన్ గౌరెల్లి గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పరిశీలించడం జరిగిందిలిఉపాధి కూలీలకు నెలలు గడుస్తున్న డబ్బులు రాక పస్తులుంటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ తావు నాయక్, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు చందునాయక్ మాట్లాడుతూ ఎర్రజండా పోరాటం వలన 2005 ఉపాధి హామీ చట్టం వచ్చిందిచట్టం వచ్చాక కొట్లాది మంది మహిళలు వృద్దులు కూలీలకు దీనిపైనా ఆధారపడి విస్తున్నారు అని అన్నారు. ఉపాధి హామీ చట్టం కూలీలకు అండగా ఉండి ఆకలి తీరిస్తున్న చట్టానికి బీజేపీ ప్రభుత్వం మార్పులు తెచ్చి తూట్లు పొడిచి క్రమంగా రద్దు చేసే ప్రయత్నం చేస్తున్నదిగతంలో ప్రతి వారం డబ్బులు వచ్చేది కూలీలా అవసరాలు తీరేది ఇప్పుడు నెలలు గడిచిన డబ్బులు రావడం లేదు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు 2పూటలా ఫొటో విధానం కూలీలకు నష్టం జరుగుతుంది ఉదయం ఫోటో తీసి మధ్యాహ్నం తీయకపోతే కూలిరాదు పనిచేసయనట్లే పేస్లిప్పులు ఉంటే కూలి ఎంత వస్తుందో తెలిసేది డబ్బులు రాకపోయినా ఆధారం ఉండేది కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు గడ్డపార మొన వాటర్ బిల్లు సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం జరిగింది. గ్రామానికి 20 పనులే మంజూరు చేయడం లాంటివి ఉపాధి హామీ చట్టాన్ని నిరుగారుస్తున్నవి ఉపాధి హామీ చట్ట రక్షణ కోసం కూలీలపెండింగు బిల్లుల పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఉపాధి కూలీలను కలుపుకొని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రమేష్,లీ రంగమ్మ,లీ రవి,లీ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్‌లో నిధులు ఎప్పుడు జమఅయ్యేనో?

**సంవత్సరాలు గడుస్తున్న ఎస్సీ కార్పొరేషన్ నిధులు**
**ఎందుకు మంజూరు కావడం లేదని లబ్ధిదారుల ఆవేదన**

బోనకల్, మే 18 ప్రజాపాలన ప్రతినిధి: నీళ్లు, నిధులు నియామకాలు కోసం కొట్లాడి తెచ్చికొన్న తెలంగాణాలో ఎస్సి కార్పొరేషన్ నిధులు కోసం సంవత్సరాలనుండి నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు, గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదని బహటంగానే చర్చించు కొంటున్నారు, నూతనంగా వ్యాపారం చేయదలంచిన నిరుద్యోగ ఎస్సి అభ్యర్థుల ఆశలు అడియాసవు తున్నాయి, నిధులు లేమీ నిరుద్యోగులు ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి ,గత కొన్ని ఏళ్లుగా ఎస్సీ కార్పొరేషన్ లో స్వయం ఉపాధి పొందుటకు అర్హులైన నిరుద్యోగులకు నిధులు జమ కావటం లేదు, వారిని నిపుణత కలిగిన వారు నైపుణ్యం లేని వారు అని రెండు రకాలుగా వర్గీకరణ చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని తుది జాబితాగా ఎంపిక చేసిన విషయం విదితమే,మండలంలోని పలు గ్రామాల నుండి నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక అయిన వారికి నేటికీ నిధులు జమకాలేదు, నిరుద్యోగం వల్ల దళితుల జీవితాలు నానాటికి దుర్బరంగా మారుతున్నాయి, దళిత బందుకూడా వస్తుందన్న గ్యారంటీ లేదు,ఈ క్రమంలో 2019- 20,2020-21 ఆర్థిక సంవత్సరంలో ఎంపిక కాబడిన వారికీ నేటికీ లోన్లులకు సంబందించిన నిధులు మంజూరి కాలేదు వాటికోసం నిరుద్యోగులు కళ్ళు కాయలు కాసేలాగా ఎదురుచూస్తూ ఉన్నారు,కాగా సంబంధిత బ్యాంకు సిబ్బందిని సంప్రదించగా ప్రభుత్వం నిధులు జమ చేయలేదని వచ్చిన వెంటనే మీకు తెలియజేస్తామని చెప్తూ ఉన్నారు, వేలమంది దరఖాస్తు చేసుకోగా,అందరికీ ఇంటర్వ్యూలు చేసి వందల్లో ఎంపిక చేసారు, వారిలో కొందరకి కూడా నిధులు నేటికీ మంజూరు చేయకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన వారికి నిధులు మంజూరు చేసి స్వయం ఉపాధి పొందుటకు అవకాశం కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని నిరుద్యోగులు కోరుతున్నారు.చిన్న చితకా లోన్లు మంజూరికే మీన మేషాలు వేస్తున్న ప్రభుత్వం, లక్షల్లో దళితభందుకు నిధులు ఎలా సమకూర్చుతారని మండలంలోని పలువురు నిరుద్యోగులు బాహటంగా చర్చిస్తున్నారు.

## ప్రజాసమస్యలు పట్టించుకోని ప్రజాప్రతినిధులు

**అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యనికి నిలువెత్తు నిదర్శనం, మధిర మున్సిపాలిటీ**



మధిర మే 18 ప్రజా పాలన ప్రతినిధి: బీజేపీ పట్టణ కమిటీ అధ్యర్యంలో గురువారం వార్డుల సందర్శనం లో బాగంగా స్థానిక రెండో వార్డ్ పరిధిలో, ఎన్ జి ఓ ఎస్ కాలనిలోపర్యటించటం జరిగింది.అక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాల చుట్టు డ్రైనేజ్ వ్యవస్థ లేదు, చుట్టుపక్కల నివాసప్రాంతాల నుండి వచ్చే మురికినీళు స్కూల్ ప్రహరీ చుట్టు చేరి గోడ పడిపోయా పరిస్థితి, స్కూల్ వెనుక ప్రాంతంలో పూర్తిగా డ్రైనేజ్ లేక రోడ్డుకు అడ్డంగా మురికి నీళ్లు పారుతున్న,ఎండాకాలంలోనే ఇలా ఉంటే మరి వర్షాకాలంలో మా పరిస్థితి ఏమిటి అని ఇక్కడ మమ్మల్ని పటించునే నాధుడు లేడని స్థానికులు తమ బాధను బీజేపీ నాయకులు ముందు వ్యక్తం చేస్తూ, ఎన్నికలప్పుడు మాత్రమే నాయకులు మావద్దకు వస్తారు, రోడ్లు వేస్తాం డ్రైనేజ్ లు కటిస్తాం అంటు హామీలు ఇస్తారు,ఎన్నికలు తరువాత మమ్మల్ని,మా సమస్యలను పాటించుకోరు,కనీసం అధికారులు,కానీ కమిషనర్ గారు కానీ మా సమస్యలు పటించుకోవడం లేదు అని, అక్కడి స్థానికులు చెప్పటం జరిగింది,తక్షణమే అధికారులు స్పందించి తక్షణమే, అక్కడ మురుగు నీళ్లు పారెలా చర్యలు తీసుకోవాలని, డిమేండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమం లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, ఏలూరి నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి, చిలువేరు సాంబశివరావు, జిల్లా అధికారప్రతినిధి, రామిశెట్టి నాగేశ్వరరావు,పట్టణ అధ్యక్షులు, పాపట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి, బియ్యవరపు రామకృష్ణ, యువమోర్చ అధ్యక్షులు, కుక్కల రాము, రవిచంద్ తదితరులు పాల్గొన్నారు,

## మధిర మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలి : సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవి



మధిర, మే 18 ప్రజాపాలన ప్రతినిధి: మండలంలో సుమారు 2000ఎకరాలలో మొక్కజొన్న పంటను వేయడం జరిగిందని, అందులో రొంపిమళ్ళ మల్లారం,జాలిముడి, సిరిపురంగ్రామాలలో రైతులు అధికసంఖ్యలోరెండవ పంటగా మొక్కజొన్న సాగుచేసారని బెజవాడ రవి అన్నారు.కానీ ప్రకృతి విపత్తు వలన అనేక ఎకరాలలో పంట నష్టం వాటిల్లి రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని అయినా మిగిలిన పంటనైనా అమ్ముకుందామంటే కొనుగోలుకేంద్రాన్ని మండలంలోఎక్కడా ఇంతవరకు ప్రారంభించకపోవడం చూస్తుంటే మధిర మండలంలోని మొక్కజొన్న పండించిన రైతులపట్ల మన ప్రజా ప్రతినిధులకు ఎంత భాద్యత వున్నదో అర్థం అవుతుందని బెజవాడ రవి విమర్శించారు. మధిర మండలంలో మొక్కజొన్న పండించిన రైతులు,తెలంగాణా రైతులు కారా, వారు పండించిన మొక్కజొన్న పంటను ఆంధ్రాలో అమ్ముకోవాలా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని ఒకప్రకటనలో కోరారు.

## యువ సమ్మేళనం 20 న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి



ఇబ్రహింపట్నం మే తేది 18 ప్రజాపాలన ప్రతినిధి :ఈ నెల 20వ తేదీన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని అంబెద్కర్ చౌరస్తాలో జరగబోయే యువ సమ్మేళనం సభ స్థలాన్ని రాష్ట్ర యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి(బంటీ) పరిశీలించారు.నియోజకవర్గానికి చెందిన 6,000 మంది యువకులతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు బంటీ తెలిపారు. కార్యక్రమంలో సిఐ రామకృష్ణ బీఆర్ఎస్ మున్సిపాల్ అధ్యక్షుడు అల్వాల్ వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జెర్కొని రాజు, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు నిట్టు జగదీష్, నాయకులు కర్నె అరవింద్, శివసాయి, ముత్యాల వినోద్, కరుణాకర్, కొత్త గణేష్, జలెందర్. పాల్గొన్నారు.

## యంపళ్ళ నిరంజన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు



ఇబ్రహింపట్నం మే తేది 18 ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ మండల పార్టీ మాజీ అధ్యక్షులు క్రీ. శే. యంపల్ల నిరంజన్ రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రం లో అంబేద్కర్ చౌరస్తాలో వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు,బంటీ యూత్ ఫోర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


**హిందుస్తాన్ బయో సైన్సెస్ లిమిటెడ్**
ప్లాట్ నెం. 31, సాగర్ సొసైటీ, రోడ్డు నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, ఇండియా, ఫోన్: 040-23555161, 23555181, ఫ్యాక్స్: 040-40205171,
వెబ్‌సైట్: www.hindustanbiosciences.in,
ఇ-మెయిల్: pharma.hindustanbio@gmail.com, CIN: L26942TG1991PLC013564

**నోటీస్**

విషయం: సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ మరియు డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 29(1)(ఎ) క్రింద బోర్డు సమావేశం వర్తమానం
యూనిట్: హిందుస్తాన్ బయో సైన్సెస్ లిమిటెడ్ (స్క్రిప్ కోడ్: 532041)

పై విషయానికి రిఫరెన్స్‌గా ఎక్స్ఛేంజికి ఇలా తెలియజేయబడుతుంది. దిగువ వాటిని పరిశీలించేందుకు మెస్సర్స్ హిందుస్తాన్ బయో సైన్సెస్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డు సమావేశం మంగళవారం 30 మే, 2023న మధ్యాహ్నం 02.00 గం.లకు ప్లాట్ నెం.31, సాగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, రోడ్డు నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034లోని కంపెనీ నమోదిత కార్యాలయంలో జరుగుతుంది.

1. 31-03-2023తో ముగిసిన సంవత్సరానికి కంపెనీ యొక్క ఆడిట్ చేయబడిన ఆర్థిక ఫలితాలు.
2. 31-03-2023తో ముగిసిన సంవత్సరానికి ఆడిట్ నివేదిక
3. సెక్రటేరియల్ ఆడిటర్ నియామకం.
4. ఇంటర్నల్ ఆడిటర్ నియామకం.
5. అధ్యక్షుని అనుమతితో ఏ ఇతర వ్యవహారమైనా.

హిందుస్తాన్ బయోసైన్సెస్ లిమిటెడ్ తరఫున
సం/-
జె.వి.ఆర్. మోహన్ రాజు
మేనేజింగ్ డైరెక్టర్ మరియు కంప్లయన్స్ ఆఫీసర్
(DIN:00060800)



**మాస్టర్ కీ TV**
Jai B Bhoomi News Channel Limited
CIN NO: U74999TG2018PLC128263

**మాస్టర్ కి టీవీ ఛానల్ లో డైరెక్టర్స్ ని ఈ క్రింది విభాగాల నుంచి తీసుకొనబడును**

1. ప్రతి కులం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
2. ఒక్కొక్క డిపార్ట్ మెంట్ నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
3. సమస్యల గురించి పోరాడే ఒక్కొక్క సోషల్ విభాగం నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
4. మైనార్టీస్, ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్ మొదలగు వారి నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
5. అభ్యుదయ వాదుల నుంచి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
6. ఒక్కొక్క పార్లమెంట్ నుంచి లేక జిల్లా నుంచి ఒక్కొక్క స్టాఫ్ రిపోర్టర్ ని తీసుకొనబడును.
7. మహిళలు & N.G.O ల నుండి ఒకర్ని లేక అంతకు మించిన ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
8. యూత్ సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి ఎక్కువ నాయకులను తీసుకొనబడును.
9. కార్మిక సంఘాల నాయకులను ఒక్కరు లేక అంతకుమించి నాయకులను తీసుకొనబడును.

**ఇంకా మీకు తెలిసిన విభాగాలను తెలియపరచగలరు**

**డాక్టర్ కె.శివ భాగ్యారావు బహుజన్, IRS-vrs**
చైర్మన్ మాస్టర్‌కీ టీవీ ఛానల్
(జై బి భూమి న్యూస్ ఛానల్ లిమిటెడ్)

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శుక్రవారం 19, మే 2023**

## మల్లయోధలకూ తప్పని హింసల పరంపర

'తోటకూర నాడే... చెప్పకపోయావా' అని తెలుగులో సామెత. కుటుంబం గానీ, తోటి వారు గానీ, సమాజం గానీ మొదలే స్పందించి ఉంటే... పరువు పోతుందనే భయాన్ని పక్కనపెట్టి తల ఎత్తి, నోరు తెరిచి ప్రశ్నించే తత్వాన్ని మన ఆడపిల్లలకు ఇచ్చి ఉన్నట్లయితే ...పరిస్థితి కొంత మెరుగ్గా ఉంటుందేమో. కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఎన్ని మొట్టికాయలు వేసినా మారాల్సింది మన సంఘం తీరు. మన రాజకీయ నాయకుల తీరు. రాజకీయాలను, నాయకులను మనం చూసే తీరు. భ్రష్టు పట్టిన నాయకులకు ఎప్పుడైతే రొమ్ము విరుచుకొని, మీసాలు మెలేసి తిరగకుండా చెప్పులతో ఎప్పుడు సత్కారాలు దొరుకుతాయో అప్పుడే ఈ సమాజం బాగుపడేది.'ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో' అన్న సినీ కవి వాక్కులు అధికార మదాంధులకు అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడూ సరిపోతాయి. ఢిల్లీ నడిరోడ్డు మీద, పార్లమెంటుకు కూతవేటు దూరంలో రోజుల తరబడి మల్ల 'యోధ' లైన యువతులు చేస్తున్న పోరాటం యావత్ దేశాన్ని కదిలిస్తోంది. మొత్తం సమాజం స్పందిస్తోంది. అంతర్జాతీయ సమాజం ఏం జరుగుతుందోనని పరిశీలిస్తోంది. కానీ కనీస స్పందన లేనిది అధికార మదాంధులకు మాత్రమే. 56 అంగుళాల ఛాతీని విరుచుకోవడం తెలిసిన నేతలకు దేశం పరువు నిలబెట్టిన యువతుల పరువు కాపాడాలన్న ఇంగిత జ్ఞానం, న్యాయం చేయాలన్న 'సోయ' మాత్రం లేకపోయింది. ఇది మన ఖర్మ అని సరిపెట్టుకోవాలా? లేక కౌరవ సభలో మాన మర్యాదలు కోల్పోయిన ద్రౌపది రోదన కురువంశ వినాశనానికి దారితీసిన విధంగా వీళ్ళ పాపం పండిందన్న నిర్ధారణకు రావాలా ? ఇప్పటికి నాలుగు నెలల నుండి ఆందోళన సాగుతోంది. అత్యున్నత న్యాయస్థానం మెట్లు ఎక్కాక గాని కాస్త ఫైలు కదలలేదు. ఎందుకు అధినాయకుల్లో చలనం లేదు? రాతి గుండెలు అనుకోవాలా. అదే సాధారణ వ్యక్తులైతే చిన్న చిన్న నేరాలకే మక్కెలిరగ్గొట్టి, కేసులు పెట్టి, జైళ్లలో కుక్కి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పుతారు కదా. అధికార, అర్థ బలంతో బలిసిన వాళ్లకు ఒక న్యాయం, సాధారణ పౌరులకు ఒక న్యాయమా! ఇదా ప్రజాస్వామ్యం ? ఆడపిల్లలు తమపై జరిగే ఏ అన్యాయమైనా...అది లైంగిక హింస గాని, గృహహింస గాని...పరువు పోతుందనో, పిల్లలు ఉన్నారనో, కెరీర్ నాశనం అవుతుందనో రకరకాల కారణాలతో నోరు విప్పరు. విప్పేలా చెయ్యదు ఈ సమాజం. పైగా 'నోరు మూసుకో' అని గదమాయిస్తుంది. లేకపోతే నోరు మూసుకొనేలా చేస్తుంది. గదిలో పడేసి కొడితే పిల్లి కూడా తిరగబడుతుంది. కాని, న్యాయం దొరుకుతుందో లేదో నన్న అపనమ్మకం. భయం. ఆ భయంతోనే పడి ఉంటారు. భరించలేకపోతే నుయ్యో గొయ్యో చూసుకోవడం మామూలే కదా. ఆ భయాలతోనే కదా ఇన్నాళ్లు పడి ఉన్నారు. స్త్రీల మంచి కోసం ఎన్నో ఉద్యమాలు నడిచాయి, నడుస్తున్నాయి. మహిళలే ఉద్యమాలు చేసినా, మగవాళ్ళ నుండి, సమాజం నుండి కూడా మద్దతు దొరికింది, దొరుకుతోంది. ఫలితంగా ఆడవాళ్లు, ఆడపిల్లలు నోరు విప్పగలుగుతున్నారు. కొన్ని భయాలు, సందేహాలు ఉన్నప్పటికీ. 'న్యాయం దొరుకుతుందో లేదో...చావో రేవో కానీ! ఏదైతే అది అయ్యిందిలే తీయి' అన్నలెక్కో. ప్రస్తుతానికి వస్తే 'ఫోగట్ సిస్టర్స్'లో ఒకరైన వినేష్ ప్రధానమంత్రికే విన్నవించుకున్నదట. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు తెచ్చిన వాళ్ళం కదా, కష్టాలు చెప్పుకుంటే ప్రధానమంత్రి తీరుస్తారనుకుందేమో పాపం. రాజకీయ నాయకులు గురించి, అధికార బలం గురించి తెలియదు కదా. అందునా కుస్తీ పోటీల్లో ఉన్న ఆడపిల్ల కదా. కాస్త ధైర్యం ఎక్కువే కావచ్చు. కానీ లోకం తీరు తెలియని పిల్లలు. తీరా చూస్తే న్యాయానికి బదులు అదిరింపులు, బెదిరింపులు. అందరూ జంతర్ మంతర్ దగ్గర ధర్నాలు చేస్తున్నారు కదా, మనకి మాత్రం న్యాయం జరగకపోతుందా అనుకున్నారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచాయి. సీజన్ జీరో డిగ్రీల టెంపరేచర్ నుండి 40 డిగ్రీల టెంపరేచర్‌కు మారింది. న్యాయం మాత్రం దొరకలేదు. ఇలా ఉంది ప్రభుత్వాల తీరు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్లకే ఇలా ఉంటే ఇక సామాన్యుల మాట చెప్పాలా. 'బలుపు, కండకావరం' వంటి పదాలు పత్రికల్లో వాడటానికి కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. స్త్రీల పట్ల అనుచితంగా ప్రవర్తించడం ఒళ్ళు బలిసినతనాన్నే సూచిస్తుందనుకోవాలి. స్త్రీలను లొంగతీసుకోవడమే మగతనం అనుకునే ధోరణి సొసైటీలో పాతుకు పోయింది. ఇక ధన బలం, అధికార బలానికి సొసైటీలో పేరు ప్రతిష్టలు తోడైతే ఇంకా హద్దు పద్దు ఉండదు. అత్యాచారాలు, ఆ పై హత్యలు, కిరసనాయిలు పోసి కాలబెట్టడాలు వంటివి టీవీల్లోనూ, పేపర్లలోను వచ్చినప్పుడు మాత్రమే గుండెలు బాదుకుంటాం. అయితే వాటికి మూలం ఎక్కడుంది? స్త్రీలను చూసే దృష్టిలోనే ఉందనేది అర్థం కావడం లేదు చాలామందికి. ఆ 'చాలా మందిలో' కుటుంబ సభ్యులు కూడా ఉంటున్నారు. ఈ మధ్య ఒక వ్యాసం చదివాను. భారత దేశంలో ఆడవాళ్లకు పిన్నీసులు, పక్క పిన్నులే గొప్ప ఆయుధాలంట. నిజమే. ఒంటరిగానైనా, జంటగానైనా, రాత్రి గాని, పగలుగాని, బస్సులో గాని రైల్లో గాని ప్రయాణం చేసేటప్పుడు ముక్కు మొఖం తెలియని వాళ్ళ వేధింపులకు గురికాని ఆడదంటూ మన దేశంలో లేదేమో. అపరిచితుల స్పర్శకి ఉలిక్కిపడి లేవడం, పిన్నీసులు తీసి గుచ్చటం, గమ్యం చేరే దాకా పళ్ళ బిగువున కాలం గడపటం-ఇలా ఎన్నిసార్లని చెప్పాలి. నేను కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఇప్పటి విషయానికి వద్దాం. ఫోగట్ సిస్టర్లుగా పేరుపొందిన బబిత ఫోగట్, గీత, రీతు, ప్రస్తుత పోరాటంలో ఉన్న సాక్షి, సంగీత, వినేష్ ఫోగట్ లు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించటం, అదే అంశంపై 'దంగల్' సినిమా రావడం అందరికీ తెలిసిందే. ఆ తరువాత హర్యానా, పశ్చిమ యు.పి వంటి ప్రాంతాల్లో, గ్రామాల్లో కూడా కుస్తీ నేర్పించే అకాడమీలు పెరిగాయి. కొన్ని వందల మంది మగపిల్లలతో పాటు ఆడపిల్లలు కూడా కుస్తీ నేర్చుకుంటున్నారు. తల్లిదండ్రుల ఇష్టంతో సంబంధం లేకుండా తాను ఇష్టపడ్డ వాడిని కులం గోత్రం చూడకుండా పెళ్లి చేసుకుందని కూతుర్ని, అల్లుడిని కుల దురహంకార హత్యలు చేయించే నేల మీదే ఆడపిల్లలు కుస్తీ నేర్చుకొని పతకాలు తేవడం గొప్ప విషయమే. అందరూ మెచ్చుకునేదే. అయితే ఈ పోటీల్లో పైకి రావడం మాత్రం తల్లిదండ్రులకు శక్తికి మించిన పని. ఉన్నదంతా కర్పూరంలా కరిగిస్తే గాని మధ్యతరగతి పిల్లలు ఆ స్థితికి రాలేరు. సాక్షి మాలిక్ తల్లి ఒక ఐసిడిఎస్ సూపర్‌వైజర్. ఈ స్థితిలో ఎన్నైనా ఓర్చుకొని కొనసాగడమా లేక తిరిగి ఇంటికి వెళ్లిపోవడమా అనేది ప్రశ్న.ఆడపిల్లలపై వేధింపులు మామూలుగా చెప్పుకునేట్లు లేవు. శ్రుతి మించి కంట్రోల్ తప్పిన స్థితిలోనే తెగించి జంతర్‌మంతర్ దారి పట్టారు. ఎంతకీ న్యాయం జరగకపోవడంతో సహజంగానే హర్యానా, పంజాబ్, పశ్చిమ యు.పి ప్రాంతాల్లో గ్రామీణ రైతు స్త్రీ పురుషులు కూడా తీవ్రంగా స్పందిస్తున్నారు. గ్రామాల నుండి స్త్రీ పురుషులు ప్రతిరోజు వందల సంఖ్యలో వచ్చి మద్దతు ఇస్తున్నారు. ఆడపిల్లల్ని అక్కున చేర్చుకొని ఆశీర్వదిస్తున్నారు. అలా సాక్షి , వినేష్ లను వాత్సల్యంతో అక్కున చేర్చుకోవడం నేను ఎన్నోసార్లు చూశాను. కారణం ఈ సమస్య తమ కుటుంబాల్లో ఉన్న పిల్లల సమస్య కూడా కావడమేమో. కోర్టులు ఎన్ని తీర్పులు ఇచ్చినా ఎన్ని మొట్టికాయలు వేసినా మారాల్సింది మన సంఘం తీరు. మన రాజకీయ నాయకుల తీరు. రాజకీయాలను, నాయకులను మనం చూసే తీరు. భ్రష్టు పట్టిన నాయకులకు ఎప్పుడైతే రొమ్ము విరుచుకొని, మీసాలు మెలేసి తిరగకుండా చెప్పులతో ఎప్పుడు సత్కారాలు దొరుకుతాయో అప్పుడే ఈ సమాజం బాగుపడేది. అటువంటి నాయకులను దేవుళ్ళుగా ఆరాధించినన్నాళ్లు, 56 అంగుళాల ఛాతీలు విరుచుకొని తిరగనిచ్చినన్నాళ్లు మన సమాజంలో మార్పు రాదు!

# పాలక వర్గాలను భయపెడుతున్న కమ్యూనిజం !



ఇటీవలి కాలంలో అనేక నగరాలలో పురోగామి శక్తులు మేయర్లుగా ఎన్నిక అవుతున్నారు. వారంతా ప్రజా ఉద్యమాలలో పని చేసి ప్రజాదరణ పొందిన వారే. చికాగోలో గతంలో అధికారంలో ఉన్న వారు అనుసరించిన విధానాల ఫలితంగా ధనికులకు మెరుగైన వసతులు, కార్మికులకు దుర్భర పరిస్థితులు, అవినీతి, అక్రమాలు, నేరాలతో జనం విసిగిపోయారు. కేంద్రం, రాష్ట్రాల నుంచి నిధులను రాబట్టి నగర జీవనాన్ని మెరుగు పరచాలన్న ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఎన్నికల్లో పురోగామి శక్తులు నెగ్గారు. నగరంలోని 50 వార్డులకు గాను జాన్సన్ మద్దతుదారులు 29 మంది గెలిచారు.కమ్యూనిజం గురించి ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు, విద్వేషాన్ని రెచ్చగొట్టినా జన జీవితాలు దుర్భరం అవుతున్నపుడు ప్రత్యామ్నాయాల గురించి జనం ఆలోచిస్తారు. అమెరికాలో, ఐరోపాలో, ఇతర చోట్ల ఇప్పుడు జరుగుతోంది అదే. గతంలో కమ్యూనిజం వైఫల్యం గురించి చర్చకు తెరతీస్తే సోషలిజం అంతరించింది అని చెప్పిన చోట జనం పెట్టుబడిదారీ విధాన వైఫల్యం గురించి ఆలోచించటం మొదలు పెట్టారు. 175 ఏళ్ల నుంచి 'కమ్యూనిస్టు ప్రణాళిక' దోపిడీ వర్గాన్ని భయకంపితం గావిస్తుంటే ఇప్పుడు పెట్టుబడిదారీ విధాన వైఫల్యంపై చర్చ కూడా దానికి తోడైంది. దాన్ని పక్కదారి పట్టించేందుకే మేము కూడా మీ గురించి ఆలోచిస్తున్నామని కార్మిక వర్గానికి చెప్పేందుకు భిన్నత్వం, న్యాయం లేదా ధర్మం, అంతర్గహణం (డిఇఐ) భావనలను ముందుకు తెస్తున్నారు. అమెరికా లోని అనేక నగరాల్లో తమకు సరైనదారి చూపేది పురోగామి శక్తులే అనే భావం బలపడుతోంది. మూడో పెద్ద నగరమైన చికాగో లో మితవాదులను పక్కకు పెట్టి పురోగామి వాదులను నగర పాలక సంస్థకు ఎన్నుకోవటం దాన్నే సూచిస్తోంది. అమెరికాలో న్యూయార్క్, లాస్ ఏంజల్స్ తరువాత మూడో పెద్ద నగరమైన చికాగో మేయర్‌గా పురోగామివాది బ్రాండన్ జాన్సన్ ఏప్రిల్ నాలుగవ తేదీన ఎన్నికయ్యాడు. చికాగో టీచర్స్ యూనియన్, కార్మిక నేతగా పని చేస్తున్నారు. మే పదిహేనవ తేదీన ప్రమాణ స్వీకారం చేశాడు. యాభై మంది కౌన్సిలర్లలో నగర చరిత్రలో పురోగామి వాదులు ఎక్కువగా ఎన్నికైన సందర్భమిదే. నిబంధనల ప్రకారం నగర పోలీసు కమిషనర్ పదవికి నగరం లోని 22 పోలీసు డివిజన్ల నుంచి వివిధ సామాజిక తరగతుల సమూహాల నుంచి ఎన్నికైన 60 మంది కమిటీ ముగ్గురు అధికారుల పేర్లను ఎంపిక చేసి సిఫార్సు చేస్తే వారిలో ఒకరిని మేయర్ ఎంపిక చేస్తారు. పోలీసు విభాగాన్ని కూడా ప్రజాస్వామ్య పద్ధతుల్లో పని చేసేట్లు చూస్తున్నారు. వచ్చే ఏడాది పాఠశాలల కమిటీలను కూడా ఎన్నికల ద్వారా నింపుతారు. ప్రజా ఉద్యమాల ప్రభావం, ప్రజానుకూల రాజకీయాలు, ఎన్నికల పట్ల పౌరుల ఉత్సాహంతో చికాగో నగరం మరింత ప్రజాస్వామిక వాతావరణంలో పురోగమించనుంది. ఇటీవలి కాలంలో అనేక నగరాలలో పురోగామి శక్తులు మేయర్లుగా ఎన్నిక అవుతున్నారు. వారంతా ప్రజా ఉద్యమాలలో పని చేసి ప్రజాదరణ పొందిన వారే. చికాగోలో గతంలో అధికారంలో ఉన్న వారు అనుసరించిన విధానాల ఫలితంగా ధనికులకు మెరుగైన వసతులు, కార్మికులకు దుర్భర పరిస్థితులు, అవినీతి, అక్రమాలు, నేరాలతో జనం విసిగిపోయారు. కేంద్రం, రాష్ట్రాల నుంచి నిధులను రాబట్టి నగర జీవనాన్ని మెరుగు పరచాలన్న ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబంగా ఎన్నికల్లో పురోగామి శక్తులు నెగ్గారు. నగరంలోని 50 వార్డులకు గాను జాన్సన్ మద్దతుదారులు 29 మంది గెలిచారు. ఆఫ్రికన్-అమెరికన్ ఓటర్లలో 80 శాతం, తెల్లవారిలో 39, లాటినోలలో 49 శాతం మంది వారికి ఓటు వేశారు. ఇటీవలి కాలంలో ఆసియన్-అమెరికన్ జనాభా కూడా పెరుగుతోంది. ఎన్నికైన వారిలో ఆరుగురు డెమోక్రటిక్ సోషలిస్టులు కూడా ఉన్నారు. వారి నేత బెర్నీ శాండర్స్ రెండు సార్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. ఏప్రిల్ 23వ తేదీన ఐరోపా దేశమైన ఆస్ట్రియాలోని సాల్జ్‌బర్గ్ రాష్ట్ర ఎన్నికల్లో కమ్యూనిస్టులు (కెపిఓ) 11.7 శాతం ఓట్లు సంపాదించారు. ఐదు సంవత్సరాల క్రితం వారికి వచ్చిన ఓట్లు కేవలం 0.4 శాతమే. మితవాదానికి కేంద్రంగా ఉన్న ఇక్కడ ఇన్ని ఓట్లు రావటం పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. కెపిఓ ప్లస్ పేరుతో స్వతంత్రులను కూడా కలుపుకొని ఒక మ్యూజియంలో గైడ్‌గా పని చేస్తున్న 34 సంవత్సరాల కె మైఖేల్ డంకల్ అనే కార్మికుడి నేతృత్వంలో పార్టీ పోటీ చేసింది. మొదటి స్థానంలో ఉన్న పార్టీకి 30, రెండో స్థానంలో ఉన్న పార్టీకి 25 శాతం చొప్పున వచ్చాయి. డంకల్ గతంలో గ్రీన్స్ పార్టీలో పని చేశాడు. వర్గ రాజకీయాలను అనుసరించటం లేదని, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం కూడా లేదని 2017లో రాజీనామా చేసి కమ్యూనిస్టులతో కలిశాడు. తరువాత 2019లో స్లాజ్‌బర్గ్ నగర ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచాడు. కమ్యూనిస్టు పార్టీ ఓట్లు అంతకు ముందున్న 1.19 నుంచి 21.5 శాతానికి పెరిగాయి. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో ఆస్ట్రియాలో నాలుగో పెద్ద నగరమైన ఈ నగర మేయర్‌గా ఒక కమ్యూనిస్టు ఉండబోతున్నట్లు విశ్లేషణలు వెలువడ్డాయి. దేశమంతటా పార్టీ ఓటింగ్ 2019లో ఒకటి నుంచి ఏడు శాతానికి పెరగ్గా 1959 తరువాత 2024 ఎన్నికల్లో తొలిసారిగా పార్లమెంటులో కూడా ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంది. ఇళ్ల సమస్య, అద్దెలు, ఇంధన ధరల పెరుగుదల వంటి రోజువారీ కార్మికుల సమస్యల మీద కేంద్రీకరించి పార్టీ ప్రజల అభిమానం పొందింది. అధికార కూటమి జనం నుంచి దూరమైంది. 2021లో జరిగిన ఎన్నికల్లో దేశంలో రెండో పెద్ద నగరమైన గ్రాజ్ మేయర్‌గా కమ్యూనిస్టు ఎన్నికయ్యాడు. గ్రీసులో జరిగిన విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష భావజాలం కలిగిన వారు 35 శాతం ఓట్లు తెచ్చుకున్నారు. వరుసగా రెండవ ఏడాది ఈ ఆదరణ లభించింది. ఈ వీధులు ఎవరివి? మావే, ఈ భూములు ఎవరికి, స్థానికులం మావే, వేరే వారికి అప్పగించటాన్ని అంగీకరించం అంటూ అమెరికా లోని మినియా పోలీస్‌లో జరిపిన ప్రదర్శనల్లో స్థానికులు కమ్యూనిస్టు, సోషలిస్టు పతాకాలను చేబూని నినదించారు. పురోగామి శక్తులు ఎన్నికల పోరాటాలతో పాటు ప్రజా ఉద్యమాల్లోనూ ముందుంటున్నారు. లాటిన్ అమెరికాలో రాగల ముప్పును గురించి కూడా హెచ్చరిస్తున్నారు. తమ దేశ ప్రజాస్వామ్య భవిష్యత్ ప్రమాదంలో పడిందని చిలీ కమ్యూనిస్టు పార్టీ హెచ్చరించింది. దేశ నూతన రాజ్యాంగ రచనకు ఏర్పాటు చేసిన 50 మంది సభ్యుల సభకు మే ఏడవ తేదీన జరిగిన ఎన్నికల్లో మితవాద, తీవ్రవాదుల పార్టీలకు చెందిన వారు 33 మంది ఎన్నిక కావటాన్ని కమ్యూనిస్టు పార్టీ ఉటంకించింది. ఆ ఎన్నికల్లో రెండు స్థానాలను పొందిన పార్టీకి ఎనిమిది శాతం ఓట్లు వచ్చాయి. అక్కడి నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాల్సి ఉంది. పోలైన ఓట్లలో 21 శాతం చెల్లనివిగా ప్రకటించారు. ఇవన్నీ కూడా వామపక్ష శక్తులుగా చెప్పుకొనే వారివేనని, వారంతా వామపక్షాలకు ఓట్లు వేసి ఉంటే ఫలితాలు వేరుగా వచ్చి ఉండేవని కమ్యూనిస్టు పార్టీ చిలీ అధ్యక్షుడు గులిరెమో టెలియర్ అన్నారు. నూతన రాజ్యాంగ రచనకు ఎంతో గట్టి పోరాటం చేయాల్సి ఉంటుందని అన్నారు. కార్పొరేట్ శక్తులు రంగంలోకి దిగి పెద్ద ఎత్తున కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసినప్పటికీ దేశంలో ఓట్ల రీత్యా మూడవ స్థానంలో పార్టీ నిలిచిందని చెప్పారు. 2021 ఎన్నికల్లో గెలిచిన వామపక్ష గాబ్రియెల్ బోరిక్ ప్రభుత్వానికి తాజా పరిణామంతో ఎలాంటి ముప్పు లేనప్పటికీ కీలకమైన రాజ్యాంగ రచనకు ఓటర్లు మితవాద శక్తుల వైపు మొగ్గు చూపటం గమనించాల్సిన అంశం. మొత్తం లాటిన్ అమెరికా, ప్రపంచంలోని కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు చిలీ పరిణామాల నుంచి గుణపాఠాలను నేర్చుకోవాల్సి ఉంటుంది.

# మహత్తర పోరాటాన్ని 'మతదృష్టి'కి కుదిస్తారా?!

మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు రాబట్టుకోవాలని చూస్తున్న హిందూ మతోన్మాద శక్తులు వీర తెలంగాణ రైతాంగ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక పోరాటంగా వక్రీకరించడం ఎన్నో రోజులుగా మనం చూస్తున్నాం. ఇప్పుడు ఆ మహత్తర పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక పోరాటం అని నిర్ధారించే ప్రయత్నం జరుగుతున్నదని డానీ వ్యాసం నిరూపిస్తున్నది. తన వాదనకోసం కామ్రేడ్ దేవులపల్లి వేంకటేశ్వరరావు (డీవీ) రచనల నుంచి తనకు కావలసిన వాక్యాలు మాత్రమే తీసుకుని, సందర్భం నుంచి విడదీసి, తనకు కావలసిన అర్థంలో డానీ ఉదహరించారు. దేవులపల్లికి లేని అభిప్రాయాలు అంటగట్టారు.దేశంలో ఎన్నో హిందూ రాజుల సంస్థానాలుండగా, ఒక్క తెలంగాణలోనే సాయుధ పోరాటం జరిగిందని అంటూ, డానీ తాను ఏర్పరచుకున్న పాక్షిక దృష్టితో, 'తెలంగాణ సంస్థానంలో రాజు ముస్లిం (నిజాం) కాబట్టి, ముస్లిం వ్యతిరేకతతోనే ఈ పోరాటం కొనసాగించారు' అనే నిర్ణయానికి వచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటం లక్ష్యాల గురించి తన పార్టీ అవగాహన మేరకు కొన్ని విషయాలు చెప్పారు కానీ కొన్ని ముఖ్యమైన అంశాలను దాటవేశారు. అది మత ప్రాతిపదికన దేశ విభజన జరుగుతున్న సమయం. ముస్లిం వ్యతిరేకత ప్రబలంగా ప్రచారం జరుగుతున్న సమయం. 1940ల నుంచి జరుగుతున్న ఫ్యూడల్ వ్యతిరేక ఉద్యమంలో 1947 తర్వాత ఈ రాజ్యం భారత్‌లో విలీనం కావాలనే కోరికతో నిజాం వ్యతిరేకతతో మాత్రమే ఉద్యమంలో చేరినవారు కూడా ఉన్నారు. భూ పంపకంలో మొదటగా నిజాముకు అండగా ఉండే ముస్లిం భూస్వాముల, జాగీర్‌దారుల భూములను పంచాలనే డిమాండుతో పార్టీలో నిజాం వ్యతిరేక భూస్వామ్య వర్గానికి నాయకత్వం వహించే మితవాదులు ముందుకు వచ్చారు. నిజాముకు వ్యతిరేకంగా కొందరు హిందూ భూస్వాములు సాయుధ పోరాటంలో పాల్గొంటున్నారు కనుక వారి భూములు పంచకూడదనే వాదం కూడా వచ్చింది. భూములు కోరుకుంటున్న ప్రజలలో ఈ భేదమేమీ లేదు. సాయుధ పోరాటంలో ఫ్యూడల్ భూస్వామ్య వ్యతిరేక, వ్యవసాయ విప్లవ స్వభావాన్ని గుర్తించక, కేవలం నిజాం (ముస్లిం) వ్యతిరేక ధోరణి మాత్రమే చూసిన వర్గం ఈ ధోరణి ప్రదర్శించింది. రావి నారాయణరెడ్డి పార్టీలో ఆ మితవాద ఆలోచనా ధోరణికి నాయకత్వం వహించేవారు. ఈ వర్గం నాయకత్వం వహిస్తున్న భువనగిరి ప్రాంతంలో భూ పంపకం సరిగా అమలు జరగలేదు కూడా. విప్లవోద్యమంలోని ఈ అంతర్గత పరిస్థితిని వివరించేందుకు తెలంగాణ ప్రజల సాయుధ పోరాట చరిత్రలో కామ్రేడ్ డీవీ అనేక విషయాలు ఉదహరించారు. ఆ వ్యాఖ్యానాల సారాంశం, తెలంగాణా ప్రజల సాయుధ పోరాటానికి ఫ్యూడల్ భూస్వామ్య వ్యతిరేక, వ్యవసాయ విప్లవ స్వభావం ఉందని, అది కేవలం ముస్లిం రాజుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం మాత్రమే కాదని. డానీ సరిగ్గా ఈ విషయాన్నే వక్రీకరించి ఆ పోరాటాన్ని ముస్లిం వ్యతిరేక పోరాటంగా చూపిస్తున్నారు. నిజాం పరిపాలనలో ఇరు మతాలలోని ధనిక వర్గాలు సౌఖ్యంగా జీవిస్తే ఇరు మతాల సామాన్య ప్రజలు కష్టాలు అనుభవించారన్న వాస్తవం ఈయనకు తెలియనిదా!నిజాం రాజు సామాన్య ముస్లిం ప్రజలకు ఏమీ ఒరగపెట్టలేదు గాని 'అనల్ మాలిక్' (నిజాం రాజ్యంలో ముస్లిములందరూ రాజులే) తరహా నినాదాలతో సామాన్య ముస్లిములను తన వైపు తిప్పుకోవడానికి ప్రయత్నించాడు. అలాగే రజాకార్ల బూచీని చూపించి హిందూ భూస్వాములు హిందువులను తమ వెంట కూడగట్టుకోవడానికి, తమ దోపిడిని ప్రశ్నించకుండా చేయటానికి ప్రయత్నించారు. వీరిలో చాలా మంది చివరివరకూ నిజాం రాజరికాన్ని సమర్థించినవారే. అలాగే రజాకారులతో కలిసి పని చేసిన నిజాం అనుకూల హిందూ భూస్వాములు చాలామంది ఉన్నారు. నిజాం రాజ్యం ఇక కూలిపోక తప్పదని నిర్ధారణ జరిగిన తరువాతనే వారిలో కొందరు కాంగ్రెసులోను, కొందరు ప్రజలతో నామమాత్రంగాను నిలిచారు. ఈ పరిణామం కూడా మత ప్రాతిపదికన జరగలేదు.దేశంలో వందల సంస్థానాలుండగా ఒక్క తెలంగాణలోనే సాయుధ పోరాటం జరిగినట్టు, దేశంలోని మిగతా సంస్థానాలలో రాజులు హిందువులు కాబట్టి అలాంటి పోరాటాలు లేవన్నట్టు డానీ రాశారు. మిగతా పోరాటాలను ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. మిగతా సంస్థానాల్లో విప్లవ రైతాంగ పోరాటాలు సాయుధ పోరాట స్థాయికి చేరుకోలేకపోవటానికి, ఆ స్థాయికి చేరుకున్నచోట్ల కూడా సాయుధ పోరాటం జరగకపోవటానికి ఆనాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ నాయకత్వానికి వ్యవసాయక విప్లవం పట్ల స్పష్టత లేకపోవడమే కారణం. కనుకనే రైతాంగ ఉద్యమాలు కొన్ని చోట్ల సాయుధ పోరాట స్థాయికి చేరుకున్నప్పటికీ మధ్యలోనే ఆపారు. ఈ ధోరణి పైచేయిగా వుండటం వల్లనే తెలంగాణ పోరాటాన్ని కూడా 1951లో ఆపివేశారు. దీనిలో మత ప్రమేయమేమీ లేదు. తమ పోరాటంలోని కొన్ని పొరపాట్ల గురించి, విప్లవం పట్ల పార్టీ అవగాహనలోను, కృషిలోను ఉన్న వైఫల్యం గురించి రాస్తూ మిగతా సంస్థానాల్లోని ప్రజల్ని సమీకరించడంలో పార్టీ విఫలమైందని డీవీ రాస్తే, 'మిగతా చోట్ల అధినేతలు హిందువులు కాబట్టి' అనే కారణాన్ని డానీ కొత్తగా కనిపెట్టారు. మత కోణమే అందుకు కారణం అని డీవీ ఎక్కడా రాయలేదు.తెలంగాణ సాయుధ పోరాటం కేవలం నిజాం వ్యతిరేక పోరాటం మాత్రమేనని, భారత యూనియన్‌లో నిజాం కలిసిపోయిన తరువాత సాయుధ పోరాటం అవసరం ఇంకెంత మాత్రం లేదని రావి నారాయణరెడ్డి ప్రభృతుల వాదన. ఈ నాయకత్వం భూమి పంపకం, వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని ఏనాడూ తమ ప్రాంతాల్లో కచ్చితంగా అమలు జరపలేదు. సాయుధ పోరాట నాయకుడిగా కీర్తించబడుతున్న ఆయన నిజాం వ్యతిరేక పోరాటం అనే నినాదాన్ని ముందుకు తీసుకు రావటంతో రజాకార్లు పోతే తమ కష్టాలు తీరుతాయనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడింది. దాని ఫలితంగానే యూనియన్ సైన్యం వచ్చినప్పుడు ప్రజలు 'రజాకార్లు పోయారు, ఇక సుఖపడవచ్చును' అన్న భ్రమలకు గురయ్యారు. కానీ ఆ సైన్యమే నిజాం సైన్యాలను మించి క్రూరంగా వేలాది విప్లవ ప్రజానీకం ప్రాణాలు హరించింది. ఈ హింసాకాండకు హిందూ, ముస్లిం మతాల వాళ్లిద్దరూ గురయ్యారు.

## ఎర్రుపాలెం గ్రామ సర్పంచ్ అప్పారావుని ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలి



ఎర్రుపాలెం మే 18 ప్రజాపాలన ప్రతినిధిబీప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించేందుకు టాంకర్ తో గ్రామంలో రోడ్ల ప్రాంతంలో నీళ్లు చల్లిస్తూ ఎండ తీవ్రత నుండి ప్రజలకు ఉపసంనాన్ని కలిగించే ప్రయత్నం..ఈ గ్రామ సర్పంచ్ ఎందరో సర్పంచులకు ప్రజాప్రతినిధులకు ఆదర్శం వేసవి తాపం నుండి ప్రజలకు ఉపశమనాన్ని కలిగించేందుకు ట్యాంకర్ ద్వారా రోడ్ల వెంట నీళ్లను చల్లిస్తున్నారు. వేసవి తాపం నుండి ప్రజల రక్షించేందుకు తన వంతు కృషి చేస్తున్న సర్పంచ్ మొగిలి అప్పారావును పలువురు అభినందిస్తున్నారు. నియోజకవర్గంలోని మండలంలోని ఉన్న సర్పంచులు, ప్రజాప్రతినిధులు సర్పంచ్ మొగులి అప్పారావు ను ఆదర్శంగా తీసుకొని తమ వంతుగా వేసవి తపన పాపం నుండి ప్రజలకు ఉపశమను కలిగించేందుకు ట్యాంకర్ల ద్వారా రోడ్ల ప్రాంతంలో నీళ్లు చల్లించవలసిందిగా పలు గ్రామ పంచాయతీ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా మదిర మున్సిపాలిటీలోని కూడా ప్రజల యొక్క సౌకర్యార్థం వేసవి తాపాన్ని తగ్గించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని చెల్లించవలసిందిగా మున్సిపాలిటీ ప్రజలు కమిషనర్ కు, చైర్పర్సన్ కు పాలకమండలికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఫార్మేషన్ రోడ్డు నిర్మాణంతో పొలాలకు వెళ్ళే మార్గం సుగమం

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్ల సత్తయ్య**



వికారాబాద్ బ్యూరో 18 మే ప్రజా పాలన : పారిశుద్ధ్యం ఉపాధి హామీ పనులలో పురోగతిని పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశామని వికారాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్ల సత్తయ్య అన్నారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని మదనపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపిడిఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మదనపల్లి గ్రామంలో 535 మంది ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పనిలో భాగంగా రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డును వేశారనీ స్పష్టం చేశారు. ఫార్మేషన్ రోడ్డు రైతుల పొలాలకు వెళ్లడానికి మార్గాన్ని సుగమం చేసిందన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉపాధి హామీ కూలీలకు అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. ఉపాధి హామీలో రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టు కింద వేసిన రోడ్డును పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్స్ తో కలిసి పరిశీలించామని తెలిపారు. రైతులకు ఉపయోగపడే పని జరగడం పట్ల ఎంపీడీఓ హర్షం వెలిబుచ్చారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ప్రత్యేక అధికారి రమేష్ కుమార్



జన్నారం, మే 18, ప్రజాపాలన: పారిశుద్ధ్య వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో ని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోపారిశుద్ధ పనులను మండల ప్రత్యేక అధికారి రమేష్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోనకల్, జన్నారం గ్రామాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు పలు చూచనాలు చేశారు. పారిశుద్ధ కార్మికులు సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఒక వారం ఆందోళన బాట పట్టిన నేపథ్యంలో గ్రామాల్లో పేరుకుపోయిన చెత్త ను పూర్తిగా తొలగించి , గ్రామాలను పరిశుభ్రంగా తీర్చి దిద్దడం కోసం పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాలలో కార్మికుల చెపుతున్న పనులను ఆయన పరిశీలించి పారిశుద్ధ్యాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాలలో ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్డు ఇరువైపులా, వీధులలో మురుగు గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాలలో చిత్తా చెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అరుణ రాణి, పోనకల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాహుల్, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

**కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆర్కే ప్రవీణ్**



ఇబ్రహింపట్నం మే తేది 18 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో బిఆర్ఎస్ ప్రభుత్వం గోరంగా విఫలం చెందిందని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆర్కే. ప్రవీణ్ అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోగా రైతులు నష్టాలపాలై రోడ్డున పడ్డారన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభించారు. తప్ప ధాన్యం కొనుగోలు లేదని అధికారుల పర్యవేక్షణ కరువైందని రైతులుకు ఎటువంటి వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారు. ప్రస్తుత సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు ఒక్కో ధాన్యం బస్తా పై 8 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని అన్నారు. లారీల కొరత వల్ల కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు కుప్పలు కుప్పలుగా నిల్వ ఉన్నాయని అన్నారు. రైతులు ఇంత ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు గాని ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని వారు కోరారు..

## మహిళా పోలీసులకు సిఐ ప్రమీల ఆదర్శం

**మర్పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాచయ్య**



వికారాబాద్ బ్యూరో 18 మే ప్రజాపాలన : మహిళా పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితులను విధులలో ఎలాంటి తరతమ భేదాన్ని చూపకుండా విధులు నిర్వహిస్తున్న మహిళా సిఐ ప్రమీలకు ఉత్కృష్ట సేవా అవార్డు రావడం అభినందనీయమని మర్పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోటమర్పల్లి గ్రామం రాచయ్య అన్నారు. రాష్ట్ర హెూంశాఖ మంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ప్రమీల ఉత్కృష్ట సేవా పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ లో సిఐ ప్రమీలను మర్పల్లి మండలం బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోట మర్పల్లి గ్రామం రాచయ్య పిఎసిఎస్ మాజీ చైర్మన్ రఘుపతి రెడ్డి వార్డు మెంబర్ చామల జైహింద్ రెడ్డి లు మిఠాయి తినిపించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మహిళలు పోలీస్ విధులను నిర్వహించడం కత్తి మీద సాము అయినప్పటికీ సామరస్యంతో సమన్వయంతో ఇద్దరి మధ్య అవగాహన కల్పిస్తూ సమస్యలను పరిష్కరించడం సిఐ ప్రమీల విధుల పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శించారని పేర్కొన్నారు. చిన్నచిన్న తగాదాలతో భార్యాభర్తలు విడిపోవాలని మహిళా పోలీస్ స్టేషన్ కు వచ్చిన వారిని చిరునవ్వుతో పలకరిస్తూ ఎంతటి తీవ్ర సమస్యనైనా చిటికెలో పరిష్కరించే వారని స్పష్టం చేశారు. సిఐ ప్రమీల విధులలో తన విధ్యుక్త ధర్మాన్ని ఏనాడు మరువలేదని గుర్తు చేశారు. విడిపోవాలనుకున్న ఎన్నో జంటలను ఒక్కటి చేసిన పుణ్యఫలం దక్కించుకున్నారని కొనియాడారు. విధులలో సమయపాలన పాటిస్తూ తన తోటి పోలీసు వారితో సమయస్ఫూర్తితో చాకచక్యంగా విధులు నిర్వహించేలా ప్రోత్సహించేవారు అని తెలిపారు. సేవా గుణాన్ని ప్రదర్శించినందుకు రాష్ట్ర హెూంమంత్రి మహమూద్ అలీ చేతులమీదుగా ఉత్కృష్ట సేవా పథకాన్ని అందుకోవడం సిఐ ప్రమీలకు మరొక్క మారు అభివందనాలు చెప్పారు. తోటి ఉద్యోగులందరూ సిఐ ప్రమీలను ఆదర్శంగా తీసుకొని తమ విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగాలని అభిలషించారు. ఇలాంటి మరెన్నో సేవా అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

## తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలి

**వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**



వికారాబాద్ బ్యూరో 18 మే ప్రజా పాలన :ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన పనులు చేపట్టి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తహసీల్దార్ లను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, తాండూర్ ఆర్డీవో అశోక్ కుమార్, అన్ని మండలాల తాసిల్దారులతో ఓటర్ జాబితా రూపకల్పన పై టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ జాబితాలో నుండి తొలగించే వారి వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలు వెంటనే అందజేయాలన్నారు. ఇట్టి పనులకు బూత్ స్థాయి అధికారుల సేవలు వినియోగించుకొని పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన పనులను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, అలాగే ఒకే ఇంట్లో ఆరుగురు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లయితే అట్టి గృహాల వివరాలను మూడు రోజులలోపు సేకరించి నివేదిక అందజేయాలని సూచించారు. ఇట్టి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు.

## మనోవికాస సంకల్ప కేంద్రాన్నికి టీవీ అందజేసిన జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి



ఇబ్రహింపట్నం మే తేది 18 ప్రజాపాలన ప్రతినిధి: నైబర్ వుడ్ సెంటర్ మంచాల మండల కేంద్రము లోని మనోవికాస సంకల్ప కేంద్రాన్నికి టీవీ అందజేసిన జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి. మంచాలలోని మనోవికాస కేంద్రానికి తన సొంత నిధులతో 45 వేల రూపాయల టీవీనీ అందజేశారు. మంచాల జడ్పిటిసి మరి నిత్య నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా దీర్ఘకాలిక, శారీరక, మానసిక, మెదోపరమైన ఇబ్బందులతో బాధపడుతున్న చిన్నారుల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది, సదరం సర్టిఫికెట్ ఉండి పెన్షన్ రానటువంటి పిల్లలు 30 మందికి పైగా ఉన్నారు కాబట్టి ఎలాంటి షరతులు లేకుండా వీరందరికీ ప్రభుత్వం వెంటనే పెన్షన్ మంజూరు చేయాల్సిందిగా కోరారు, గత మూడు సంవత్సరాలుగా ఫిజియోథెరపిస్టు లేనందువల్ల పిల్లలు తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నందున వెంటనే నియమించాలని కోరారు, సెంటర్ కి సంబంధించిన సమస్యలను జడ్పిటిసి దృష్టికి తీసుకువచ్చిన నిర్వాహకులు, నైబర్ వుడ్ సెంటర్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సంబంధించిన నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది, సెంటర్ కి సంబంధించిన సమస్యలు పరిష్కారానికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేయడం జరిగింది, గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు టీవీని అందజేసినందుకు పిల్లల తల్లిదండ్రులు జడ్పిటిసి లిమర్రి నిత్య నిరంజన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ సర్ప్ డిస్టిక్ ఆఫీసర్ జంగారెడ్డి, సర్పంచ్ అని రెడ్డి జగన్ రెడ్డి, ఏపీఎం శోభ, జైపాల్ రెడ్డి, సెక్రెటరీ రాజ్ కుమార్, స్పీచ్ తేరఫిస్ట్, టీచర్స్, సంతోష, సుజాత, స్వరూప, సురక్షిత, కవిత, యాదమ్మ, స్థానిక నాయకులు అశ్వాల బాలరాజ్,మరియు పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టులను సందర్శించిన జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి



ప్రజాపాలన బ్యూరో, (నిర్మల్ ) మే 18: నిర్మల్ జిల్లాలోని పలు ప్రాజెక్టులను జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి గురువారం పరిశీలించారు. స్వర్ణ ప్రాజెక్టు, పొన్ కల్ లో నూతనంగా నిర్మించబడుతున్న ప్రాజెక్టు, సదర్మట్ ప్రాజెక్ట్, కడెం ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టులకు సంబంధించిన అధికారుల ద్వారా ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం, ఇన్ఫ్లో ,అవుట్ ఫ్లో ,డెడ్ స్టోరేజ్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు మరమ్మత్తులకు సంబంధించి పనులలో అలసత్వం వహించవద్దని, రానున్నది వర్షాకాలం కావున ప్రతి ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ కు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు ఉచిత శిక్షణ




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి ):ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో సుమారు 40 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేక పోయారని అలాంటివారికి షహీన్ అకాడమీ తో కలిసి ఉచితంగా ఆన్ లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు సోషల్ డేటా ఇన్షియేటివ్ ఫోరం (ఎస్ డి ఐఎఫ్) డైరెక్టర్ ఖలీద్ సైఫుల్లా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా రెండు లక్షలకు పైచిలుకు ఉత్తీర్ణత సాధించగా, లక్ష యాభై మూడు వేల మంది ఫెయిల్ అయ్యారని అన్నారు. పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నారని అలాంటి వారికి నిష్ణాతులైన అధ్యాపకులచే ఆన్లైన్ ద్వారా అన్ని సబ్జెక్టులలో పూర్తి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫ్రీ సప్లమెంటరీ కోచింగ్ డాట్ కామ్ ను లాగిన్ కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 8927911911 నెంబర్ కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఇంతియాజ్, అంజద్, ఆయేషా రుబీనా, ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు..

## 31వ రోజుకు చేరిన వివో ఏ ల సమ్మె



చేవెళ్ల మే 18, (ప్రజాపాలన): చేవెళ్ల మండల కేంద్రంలో వివో ఏల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి అనంతరం మాట్లాడుతూ గత నెల ఏప్రిల్ 17 తారీకు నుంచి వివో ఏ లు తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తా ఉంటే ప్రభుత్వం ఇప్పటికీ స్పందించక పోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలపై స్పందించిందని కానీ వివోఏల సమస్యలపై స్పందించకపోవడం వారిని చిన్నచూపు చూడడమే అని అన్నారు గ్రామాలలో మహిళలకు పొదుపు సంఘాలను ఏర్పాటు చేస్తూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం వివోఏలు ఎంతో కృషి చేస్తుంటే వారి శ్రమ ను ప్రభుత్వం గుర్తించకపోవడం శోచనీయమని అన్నారు ప్రభుత్వం స్పందించేంతవరకు సమ్మె విరమించేది లేదని అన్నారు ప్రభుత్వాన్ని మెడలు వంచైనా సరే వివో ఎలా సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఎర్రజెండా పోరాటం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో వివోఏల జిల్లా సహాయ కార్యదర్శి చంద్రశేఖర్ మండల అధ్యక్షురాలు కవిత, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వివో ఏలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



మంచిర్యాల బ్యూరో,(నిర్మల్) మే18, ప్రజాపాలన:నిర్మల్ జిల్లాలోని అనంత పెట్ గ్రామ చెరువులో చెపడుతున్న ఉపాధి హామీ పనులను జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు అందరూ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వేయరాదనీ ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. చెరువు సమీపంలో గల చెత్త చెదారం పాలతిన్ కవర్లను స్వయంగా కలెక్టర్ తొలగించారు. ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విజయలక్ష్మి,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి క్రీడలు ఎంతో అవసరం





చేవెళ్ల మే 18,(ప్రజాపాలన):క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కలిగిస్తాయని కాంగ్రెస్ నాయకుడు కావాలి వెంకటేష్ బాబు అన్నారు.గురువారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన కేవీబీ ప్రీమియర్ లీగ్ కు అతిథిగా చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరేందర్ రెడ్డి పాల్గొని కావలి వెంకటేష్ బాబుతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని రాణించాలన్నారు.క్రీడలు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని,ఆటలు ఆడటం వల్ల చురుకుదనం,అందరితో కలిసి ఉండాలనే భావన పెరుగుతుందని అన్నారు.అలాగే నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఇలాంటి టోర్నమెంట్లలో గ్రామీణ ప్రాంతాల క్రీడాకారుల ప్రతిభను గుర్తించవచ్చు అని అన్నారు. మొదటి రోజు జరిగిన మ్యాచ్ లో అంతారం,కౌకుంట్ల గ్రామాల టీమ్ లు తలపడ్డాయి.టోర్నిలో గెలిచిన టీమ్ కు మొదటి బహుమతి గా 20,000 ద్వితీయ బహుమతి 10,000 అందజేయనున్నట్లు ఆర్గనైజర్స్ తెలిపారు.ఈ కార్యక్రమంలో చాకలి సుధాకర్,జుట్టు సుధాకర్,గణపురం నరేందర్,చాకలి కుమార్,బండ సత్యనారాయణ,పాషా,మాదిగ నగేష్,అల్లి రవి కిషోర్,నాగారం ప్రవీణ్, లక్ష్మినారాయణ, అనంతయ్యదయాకర్, బేగరివీరాంజనేయులు, రాజు, ఆంజనేయులు, మణికంఠ, శ్రీనివాస్, నవీన్, భీమయ్య, అనిల్, భరత్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పట్టు గుళ్లు రైతులను ఆదుకోండి

**ఎంపీ రంజిత్ రెడ్డి ని కలిసిన చేవెళ్ల రైతులు**



చేవెళ్ల మే 18, (ప్రజాపాలన):పట్టు గుళ్లు రైతుల సమస్యలను పరిష్కరించాలని చేవెళ్ల బిఆర్ఎస్ నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల రైతులు ఎంపీ రంజిత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రైతులు ఎంపీతో మాట్లాడుతూ.. తిరుమలగిరి మరియు జనగాం మార్కెట్ లో పట్టు గుళ్ళు అమ్మిన డబ్బులు నెలల తరబడి రావడం లేదని మా సమస్యను పరిష్కరించాలని ఎంపీకి విన్నవించుకున్నారు.వెంటనే ఎంపీ స్పందించి కమిషనర్ హనుమంతరావు,మార్కెట్ అధికారి తో మాట్లాడి సమాస్యనుపరిష్కరించాడు.మా సమస్య పట్ల ఎంపీ స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బక్కారెడ్డి రవీందర్ రెడ్డి,కృష్ణారెడ్డి, కనకమామిడి అనంత రెడ్డి,దోసడ శేఖర్ రెడ్డి మరియు మద్దెల జంగయ్య పాల్గొన్నారు.

# దేవుని రూపంలో మానవుల విగ్రహాలు పెట్టడం దారుణం: మాజీ మంత్రి కృష్ణ యాదవ్



హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):దైవపూజ వేరు, వ్యక్తి పూజ వేరు అని భగవంతుడు శ్రీ కృష్ణుడి రూపంలో ఒక మనిషి విగ్రహాన్ని పెట్టడం తగదన్నారు మాజీ మంత్రి కృష్ణ యాదవ్.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో భారత యాదవ సమితి, ఇస్కాన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం లో శ్రీ కృష్ణుడి రూపంలో ఎన్ టి ఆర్ విగ్రహాన్ని పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకస్తున్నామన్నారు. ప్రపంచం మొత్తం ఆరాధించే భగవాన్ శ్రీ కృష్ణుడి రూపంలో ఒక సినీ నటుడి విగ్రహం పెట్టడం ద్వారా సమాజానికి ఏం చెప్పదల్చుకున్నారని ప్రశ్నించారు.విగ్రహం పెట్టడానికి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారన్నారు.రాజకీయంగా ఒక రెండు కులాల ఓట్ల కోసం దేవుళ్ళను వాడుకోవద్దన్నారు. ఎన్ టి ఆర్ సినిమాలలో బృహన్నల వంటి చాలా వేషాలు వేశారని మరి ఆయా రూపాలలో ఎన్ టి ఆర్ విగ్రహాన్ని పెట్టగలరా అని ప్రశ్నించారు.28 వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేస్తూనే ఉంటామన్నారు.ప్రభుత్వ ప్రదేశాలలో ప్రైవేట్ వ్యక్తులు విగ్రహాలు పెట్టారాదని జి ఒ ఉన్నా విగ్రహం పెట్టడం తగదన్నారు.ఒక వ్యక్తిని భగవంతుడు అని చూపించే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. తాను స్వయంగా ఎన్ టి ఆర్ అభిమానినని, నటుడిగా, నాయకుడిగా ఎన్ టి ఆర్ ను స్వాగతిస్తామని, దేవుని రూపంలో విగ్రహం పెట్టడం తగదన్నారు.ఈ విషయాన్ని గవర్నర్ దృష్టి కి తీసుకెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో కరాటే కళ్యాణి ప్రభాకర్ యాదవ్,రమణ కుమార్ ఇస్కాన్, బాలకృష్ణ,సుబ్బలక్ష్మి,వి హెచ్ పి నేత కృష్ణారెడ్డి, శ్రీశైలం యాదవ్,నాగరాజు,నగేష్ యాదవ్,కశ్యప్ రెడ్డి,కరాటే కళ్యాణి, మాజీ మంత్రి కృష్ణ యాదవ్, భారత యాదవ సమితి నాయకులు రమేష్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటిస్తాం

## ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి

## పరిగి మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ బ్యూరో 18 మే ప్రజాపాలన : రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగిస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగి మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. కర్ణాటక రాష్ట్రం ఎన్నికల ప్రభావం తెలంగాణ పై ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో గల సాకేత్ నగర్ లోని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కర్ణాటక రాష్ట్రంలో అమలుపరిచిన ఎన్నికల విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వరంగల్ డిక్లరేషన్ తూచా తప్పకుండా అమలు పరుస్తామని తెలిపారు. ప్రజాకర్షక పథకాలతో రాబోవు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయదుందుభి మోగించనున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రత్యర్థి పార్టీలను కట్టడి చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణను రూపొందిస్తామని అన్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అని తరచుగా నినదించేవారు ఇప్పుడు భాజపాను దక్షిణ భారత్ ముక్త్ ను ఎదుర్కోవలసి వస్తుందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కింద నాలుగు వేల రూపాయలు అందజేస్తామని చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి సంతోష్ కుమార్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్ రెడ్డి బ్లాక్ అధ్యక్షుడు కామిడి అనంత్ రెడ్డి ఎర్రవల్లి జాఫర్ చామల రఘుపతి రెడ్డి చాపల శ్రీనివాస్ ముదిరాజ్ కలో?డ నర్సిములు సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ 2 లక్షలు బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, మే18 (ప్రజాపాలన ప్రతినిధి): ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ డివిజన్ ఆర్టీసీ కాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు జగదీష్ కుమార్ ప్రమాదంలో మరణించగా బీఆర్ఎస్ పార్టీ తరఫున మంజూరైన రూ 2 లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులైన భార్య పద్మజ, కుమారుడు తరుణ్ లకు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ పరంగా కార్యకర్తలను అందుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు రూ 2 లక్షల బీమా పాలసీని ప్రవేశపెట్టారని తెలిపారు.పార్టీ పరంగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవాలని ఒక మంచి ఆలోచనతో ఇన్సూరెన్స్ ప్రీమియం డబ్బులను పార్టీ చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రమాదంలో చనిపోతే వెంటనే సంబంధిత కాగితాలను రెండు నెలల్లో పార్టీ కార్యాలయంలో అందజేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ నాగేందర్, డిఈ నాగమణి, బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్, లేతకుల రఘుపతి రెడ్డి, జెసిబి రాజు, కృష్ణ మారుతి, కామేశ్వరరావు డాన్ శీను, సంధ్యారాణి, చాపల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు మందులు ఎరువులను అరికట్టాలి

**నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్**



వికారాబాద్ బ్యూరో 18 మే ప్రజా పాలన : రాబోవు వర్షాకాలం నాటికి నకిలీ విత్తనాలు మందులు ఎరువులను అరికట్టాలని నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన ప్రజాపాలన బ్యూరో రిపోర్టర్ తో మాట్లాడుతూ వివిధ మండలాలలోని గ్రామాలలో భూసార పరీక్షలు నిర్వహించాలని సూచించారు. లాభాజనే ధ్యేయంగా ఫెర్టిలైజర్ వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు మందులు ఎరువులను రైతులకు పంపిణీ చేయుటకు గోదాముల్లో నిల్వ ఉంచుకున్నారని ఆరోపించారు. కేంద్ర పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో పని చేసే జెనెటిక్ అప్రూవల్ ఇంజనీరింగ్ (జేఈఏసీ) హెచ్చరికను నిర్లక్ష్యం చేయరాదన్నారు. మధ్య దళారులు రహస్యంగా నకిలీ విత్తనాలను మందులను ఎరువులను విక్రయించేందుకు పలు గ్రామాలలో తిరుగుతున్నారని స్పష్టం చేశారు. ఫర్టిలైజర్ దుకాణాలపై సంబంధిత అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి నిఘా ఏర్పాటు చేయాలన్నారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్**






ఆసిఫాబాద్ జిల్లా మే18 (ప్రజాపాలన,ప్రతినిధి) : ప్రభుత్వం నిషేధించిన మత్తు పదార్థాలు వాడిన, విక్రయించిన, కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ అన్నారు. గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరిడెంట్ జ్యోతి కిరణ్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ, సమన్వాయంతో నిషేధిత పదార్థాల నిర్మూలనకు జిల్లాలో రెండు టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్న పోలీస్ శాఖకు లేదా ఎక్సైజ్ శాఖకు తెలుపవచ్చని అన్నారు. జిల్లాలో రైల్వే స్టేషన్, బస్టాండ్లు, గ్రామాల్లో రెక్కి నిర్వహించాలని పోలీస్ అధికారులకు తెలిపారు. మత్తు పదార్థాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని, వారు ఏ స్థాయి వారైనా చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సుధాకర్, కరిముల్లా ఖాన్, పవన్ కుమార్, మోహిన్ అలీ, విలాస్, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పర్యటించిన జడ్పీ చైర్మన్, డిసిసిబి చైర్మన్





బోనకల్ మే 18 ప్రజా పాలన ప్రతినిధి: మండలంలో గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం పర్యటించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా పెద్ద బీరవల్లి సహకారసంఘం అధ్యక్షులు చింతలచేర్వు కోటేశ్వరరావు తో కలిసి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. ఆనంతరం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పువ్వాడ అజయ్ కుమార్ సిఫారసు తో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు చొరవతో మంజూరైన 5,55,500/- లక్షల రూపాయల విలువ చేసే 16 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నేరుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనంతరం బ్రాహ్మణపల్లి సహకార సంఘం పరిధిలో అధ్యక్షులు ఏనుగు నాగేశ్వరరావు తో కలిసి మొక్క జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేబ్రోలు మల్లికార్జునరావు, కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు, రావినూతల గ్రామ సర్పంచ్ కామినేని ఉపేందర్, మండల రైతు బంధు కన్వీనర్ వేమూరి ప్రసాద్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సైదా, టిఆర్ఎస్ నాయకులు తమ్మారపు బ్రహ్మయ్య, భూక్యా లక్య ,వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిట్టల రవీందర్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన ముదిరాజ్ మహాసభ...




హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):పిట్టల రవీందర్ ను మత్స్యశాఖ చైర్మన్ గా నియమించడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో మహాసభ ప్రతినిధులు మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి అధికారం లోకి వచ్చాకనే మత్స్య శాఖ అభివృద్ధి బాటలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి కులాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరం అన్నారు. ముదిరాజ్ ల అభ్యున్నతికి సి ఎం చాలా కార్యక్రమాలు చేపట్టారని, బండ ప్రకాష్ ను ఎం ఎల్ సి గా చేయడం, కోకాపేట లో ఐదు ఎకరాల స్థలం కేటాయించడం అందులో భాగమే అన్నారు.ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు డాక్టర్ గుండ్లపల్లి శ్రీనివాస్ ముదిరాజ్,అల్లుడు జగన్,బల్ల సత్తయ్య, యాదయ్య, మందుల వరలక్ష్మి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను రక్షించుకోవాలి



మంచిర్యాల బ్యూరో, మే 18, ప్రజాపాలన: ప్రస్తుత తరుణంలో హిందూ సంస్కృతిని, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్యుల శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థాన పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామిజీ అన్నారు. గురువారం మంచిర్యాలలోని శ్రీ భగవద్గీత అధ్యయన మండలిలో నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక భవనమును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను నిలయం అయిన భారత దేశంలో పుట్టడమే మన భాగ్యమని ఇలాంటి హిందు సంస్కృతిని ఎల్లప్పుడు రక్షించుకుంటు మన ఘనతను ప్రపంచానికి చాటాలని అన్నారు. నేటి హైటెక్ యుగంలో విజ్ఞానం పేరిట సెల్ఫోన్లు, సామాజిక మాధ్యయాలు ఎంత పెరిగినప్పటికీ ప్రతి ఇంట్లో భగవద్గీత పుస్తకాన్ని ఉంచుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రతీ తల్లిదండ్రులు తమ పిల్లలకు భగవద్గీతలోని శ్లోకాలను, వాటి అర్థాలను వివరిస్తే పిల్లల భవిష్యత్కు మంచి పునాది వేసినవారం అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, మున్సిపల్ వైర్పర్సన్ పెంట రాజయ్య, వైఎస్ ఛైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, శ్రీభగవద్గీత అధ్యయన మండలి గురూజీ డాక్టర్ కృష్ణారెడ్డి, అధ్యయన మండలి అధ్యక్షులు రంగ ఆగయ్య, ప్రాజెక్టు ఛైర్మన్, కౌన్సిలర్ మాదంశెట్టి నారాయణ, కార్యదర్శి కటుకం హరీష్, కోశాధికారి ద్రాక్షపల్లి చంద్రశేఖర్, కార్యనిర్వహణ అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి, వైఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ సుగుణాకర్రెడ్డి, కౌన్సిలర్ గాదె సత్యం, చందూరి పురుషోత్తం, చిలువేరు శ్రీనివాస్ , డాక్టర్ కండే కృష్ణ, గుండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం అటవీ ప్రాంతంలో నైట్ పెట్రోలింగ్ వాహనం ఏర్పాటు




జన్నారం, మే 18, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండల కవ్వాల్ అటవీ ప్రాంతంలో నూతనంగా నైట్ పెట్రోలింగ్ వాహనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జన్నారం మండల ఎండిఓ మాధవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అటవీ కార్యాలయంలో ఎఫ్డిఓ విలువలతో మాట్లాడారు. కవ్వాల్ అటవీ జోన్ , జన్నారం, ఇందనపల్లి, తాళ్లపెట్, రేంజ్ పరిధిలలో అత్యవసర సమయంలో రాత్రివేళలో అటవీ ప్రధాన రహదారి గుండా నైట్ పెట్రోలింగ్ చేయడానికి ప్రభుత్వం వాహనాన్ని అనుమతి ఇచ్చిందన్నారు. అడవుల పెంపకం అందరి బాధ్యతయన్నారు. అక్రమ కలప రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ రక్షణ ధ్యేయంగా అటవీశాఖ అధికారులు పనిచేయాలని సూచించారు.

## నస్పూర్ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



మంచిర్యాల టౌన్, మే 18, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం సింగరేణి ఆఫీసర్స్ క్లబ్ నియర్ సింగరేణి హై స్కూల్ వద్ద గురువారం రోజున నస్పూర్ రెవెన్యూ అధికారిణి ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్ డి ఓ వేణు లు హాజరై మాట్లాడుతూ రక్తదానం మరొక్కరికి ప్రాణదానం అని ఎల్ల వేళలా యువత రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు రక్తదానం చేసిన రక్తదాతలను అభినందించారు .ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కోశాధికారి పడాల రవీందర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్ కమిషనర్ రమేష్ డి టి శ్రావణి రెవెన్యూ ఆర్ ఐ మంతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల చీలికపైనే గులాబీ ఆశలు



హైదరాబాద్, మే 18, :తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 105 సీట్లలో గెలుపు ఖాయమని ప్రకటించారు. వందేళ్లలో చేయేలని అభివృద్ధి చేశామని.. చేసింది చెప్పుకుంటే చాలని ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. అత్యవసరంగా పిలిచిన నిర్వహించిన మీటింగ్‌లో చెప్పింది ఇదే. కేసీఆర్‌కు అంత నమ్మకం ఏమిటన్నది పార్టీ నేతలకూ అర్థం కాని విషయం. నిజానికి తెలంగాణలో ప్రస్తుతం అంత ఏకపక్ష వాతావరణం లేదని కానీ.. పార్టీ నేతల్లో నమ్మకం, ఆత్మ విశ్వాసం కల్పించడం.. నేతలు ఇతర పార్టీల వైపు చూడకుండా ఉ ండటానికి ఇలా చెప్పారని ఎక్కువ మంది భావిస్తున్నారు. 2018లో భిన్నమైన రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అప్పటికి తెలంగాణ సెంటిమెంట్ ఇంకా చల్లారలేదు. ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు జోక్యంతో సెంటిమెంట్ ఓటర్ల ప్రధాన ఓటింగ్ అంశం అయింది. దానికి తోటు రైతు బంధు పథకాన్ని అప్పుడే తీసుకు వచ్చారు. నేరుగా రైతులు చెక్కులు ఇచ్చి.. డబ్బులు కళ్ల జూసేలా చేశారు. దీంతో ఆ ఓటు బ్యాంక్ కలిసి వచ్చింది. రెండో సారి తిరుగులేని విజయం వచ్చింది. మరి ఇప్పుడు అప్పట్లా పరిస్థితులు ఉన్నాయా అంటే లేవన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది. సహజ సిద్ద ఆయుధం అయిన సెంటిమెంట్ ను కేసీఆర్ వదిలేశారు. టీఆర్ఎస్ పార్టీనే ఏకంగా బీఆర్ఎస్ అని మార్చేశారు. బెంచ్ మార్క్ పథకాలు .. ఎక్కువ మందిలో అసంతృప్తికి కారణం అవుతున్నాయి. దళిత బంధు పథకం అందిన వారు మినహా ఇతరులు అసంతృప్తిగా ఉన్నారు. ఇతర వర్గాలు కూడా మాకేంటి అనుకుంటున్నాయన్న ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల నాటికి కాంగ్రెస్ బలపడలేదు. ఆ పార్టీలో వర్గ పోరాటం.. టీడీపీతో పొత్తు కారణంగా ఆ పార్టీ బలహీనం అయింది. అప్పట్లో బీజేపీ దీన స్థితిలో ఉంది. కానీ ఇప్పుడు కాంగ్రెస్ తో పాటు బీజేపీ కూడా పుంజుకున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ చాలా గట్టిగా పోరాడుతోంది. ఓ వైపు రేవంత్.. మరో వైపు భట్టి విక్రమార్క పాదయాత్రలు చేస్తున్నారు. కర్ణాటకలో గెలుపు తర్వాత ఆర్థిక వనరులకు కూడా లోటు ఉండదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఇక భారతీయ జనతా పార్టీ కూడా బలపడింది. గత ఎన్నికల్లో వేళ్ల మీద లెక్క పెట్టగలిగినన్ని చోట్ల మాత్రమే డిపాజిట్ తెచ్చుకుంది. కానీ ఈ సారి మాత్రం ఒక్కో నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. వారిలో ఎంత బలవంతులు అనేది పక్కన పెడితే పెరిగిన బీజేపీ క్రేజ్ ను ఈ విషయం తెలియచేస్తుంది. ఎలా చూసినా ఇప్పుడు తెలంగాణలో రెండు జాతీయ పార్టీలు బలపడ్డాయనే. ముక్కోణపు పోటీలో మూడు పార్టీలూ హోరాహోరీగా తలపడితే మాత్రం కేసీఆర్ మూడో సారి విజయం సాధిస్తారనే అంచనా మొదటి నుంచి ఎన్నికల నిపుణులు వేస్తున్నారు. కానీ ఇటీవలి కాలంలో జరుగుతున్న ఎన్నికల ట్రెండ్ ను చూస్తే.. ప్రజలు రేసులో ఎన్ని పార్టీలు ఉన్నా.. ఒకే పార్టీ వైపు మొగ్గుతున్నారు. మొన్న పంజాబ్.. నిన్న కర్ణాటకలను చూస్తే ఇదే అర్థం అవుతుంది. తెలంగాణలో ప్రజలు కేసీఆర్ పదేళ్ల పాలన చాలు అనుకుంటే.. ఓ ప్రత్యామ్నాయం వైపు మొగ్గుతారు. ఆ ప్రత్యామ్నాయం బీజేపీ, కాంగ్రెస్ నా అన్నది తేల్చుకుంటారు. ఓట్లు చీలిపోతే మాత్రం బీఆర్ఎస్ కు అడ్వాంటేజ్ కనిపించవచ్చు ప్రజలు వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఉండాలా వద్దా అన్నది నిర్ణయించుకునేది ఈ ఆరు నెలల్లోనే. ఇప్పుడే అసలు రాజకీయం ప్రారంభమైందని అనుకోవచ్చు. కేసీఆర్ తమ నేతల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు వంద లెక్కలు చెబుతున్నారని ఎక్కువ మంది నమ్ముతున్నారు.

# రేపు సిద్దారామయ్య ప్రమాణం

(మొదటి పేజీ తరువాయి)

**కర్నాటక సీఎంగా సిద్దరామయ్య..**
కర్నాటక సీఎంగా సిద్దరామయ్య ఈనెల 20వ తేదీన ప్రమాణం చేస్తారు. డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణం చేస్తారు. బెంగళూర్‌లో జరిగిన సీఎల్పీ భేటీలో సిద్దరామయ్యను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నేతగా ఎన్నుకున్నారు. ఢిల్లీ నుంచి బెంగళూర్ చేరుకున్న సిద్దరామయ్య, డీకే శివకుమార్‌కు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. సిద్దరామయ్య కాన్వాయ్‌పై పూలవర్షం కురిపించారు కార్యకర్తలు.

**డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ఒక్కరే..**
డీకే శివకుమార్ వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు కేపీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతారని క్లారిటీ ఇచ్చారు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్. డిప్యూటీ సీఎంగా డీకే శివకుమార్ ఒక్కరే ప్రమాణం చేస్తారని స్పష్టం చేశారు. సీఎం పదవిని రెండున్నర ఏళ్ల పాటు ఇద్దరు నేతలు పంచుకుంటారన్న విషయంపై మాత్రం ఆయన ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

**అసంతృప్తి లేదన్న డీకే..**
సీఎం పదవి దక్కకపోవడంపై ఎలాంటి అసంతృప్తి లేదన్నారు డీకే శివకుమార్. కర్నాటక భవిష్యత్, రాష్ట్ర ప్రజల సంక్షేమమే తొలి ప్రాధాన్యత అని అన్నారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్ మధ్య రాజీ కుదర్చడంలో ఖర్గే కీలకపాత్ర పోషించారు. సీఎం ఎంపిక తరువాత ఇద్దరు కలిసి లంచ్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.

**కేబినెట్‌లో చోటు దక్కించుకుంది వీరే..**
ఈశ్వర్ ఖండ్రే, హంపన గౌడ, హెచ్‌కే పాటిల్, లక్ష్మణ్ సవది, లక్ష్మి హెబ్బాల్కర్, డా.జి.పరమేశ్వర్, సతీష్ జరకిహోలీ, సుబ్బారెడ్డికి కేబినెట్‌లో అవకాశం దక్కబోతోంది.

**విపక్ష నేతలకు ఆహ్వానం..**
సిద్దరామయ్య ప్రమాణస్వీకారోత్సవానికి పలువురు విపక్ష నేతలకు ఆహ్వానం అందింది. బీహార్ సీఎం నితీష్, బెంగాల్ సీఎం మమత, తమిళనాడు సీఎం స్టాలిన్, సీపీఎం నేత ఏచూరి, ఫరూక్ అబ్దుల్లా తదితరులకు ఆహ్వానాలు అందాయి. కానీ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, తెలంగాణ సీఎం కేసీఆర్ , ఏపీ సీఎం జగన్‌కు మాత్రం ఆహ్వానాలు అందలేదు.

## సొంత పార్టీ నేతలపైనే ట్రోలింగ్స్...

# కాంగ్రెస్సా.. మజాకా..!



హైదరాబాద్, మే 18, : తెలంగాణ యూత్ కాంగ్రెస్ వార్ రూమ్‌పై సైబర్ క్రైమ్ పోలీసుల దాడి వ్యవహారంలో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై జరుగుతున్న ట్రోలింగ్‌పై ఫిర్యాదు నేపథ్యంలోనే సోదాలు జరిపినట్లు పోలీసులు స్పష్టం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో గ్రూపు గొడవలు పతాక స్థాయికి చేరాయి. రెండ్రు రోజుల క్రితం సైబర్ క్రైమ్ పోలీసుల దాడి చేయడం రాజకీయంగా దుమారాన్ని రేపింది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో పోలీసులు వెల్లడించిన విషయాలు తెలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు షాక్ అయ్యారు.వార్ రూమ్‌పై సైబర్ పోలీసులు దాడి చేయడానికి పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫిర్యాదే కారణమని పోలీసులు వెల్లడించారు. "కాంగ్రెస్ పార్టీకి పట్టిన క్యాన్సర్ ఎవరు అంటూ" ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో పోస్టులు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఉత్తమ్ ఫోటోకు మాస్క్ వేసి వీటిని వైరల్ చేశారు. ఈ వ్యవహారంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఉత్తమ్ కుమార్ రెడ్డికి వ్యతిరేకంగా వచ్చిన పోస్టులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆరా తీసిన పోలీసులకు ఆయన ఇంటికి సమీపంలో ఉన్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ వార్ రూమ్ ఉన్నట్లు గుర్తించారు. వార్ రూమ్ ఇంఛార్జి ప్రశాంత్‌తో పాటు మరో నలుగురు అక్కడ పనిచేస్తున్నట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పోస్టులు వేయడానికి వినియోగించిన కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లను సైబర్ విశ్లేషణ కోసం స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేశారుబంజారాహిల్స్‌లోని యూత్ కాంగ్రెస్ వార్‌రూమ్ కార్యాలయంలో సైబర్ క్రైమ్ పోలీసులు సోదాలు చేయడం, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లతోపాటు కార్యకర్తల ఫోన్లను తీసుకెళ్లడంపై మొదట కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టింగులు వస్తుండడంతో ఆయన చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని పోలీసులు చెప్పడంతో 40 రోజుల క్రితం చేసిన ఫిర్యాదుపై ఇప్పుడు దర్యాప్తు చేయడమేంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏప్రిల్ 5న ఫిర్యాదు చేయగా.. సైబర్‌క్రైమ్ పోలీసులు మే 15 రాత్రి యూత్ కాంగ్రెస్ వార్‌రూమ్ కార్యాలయంలో సోదాలు చేశారు. ఈ కార్యాలయం నుంచే ఉత్తమ్‌కు వ్యతిరేకంగా పోస్టింగులు అప్‌లోడ్ అవుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ మేరకు కార్యాలయంలోని కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లతోపాటు వార్‌రూమ్ ఇన్‌చార్జి ప్రశాంత్ స్మార్ట్‌ఫోన్‌ను, మరో యూత్ కాంగ్రెస్ నాయకుడి ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ ఘనవిజయం సాధించడంతో భయాందోళనకు గురవుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం తమపై దాడులు చేసి తమ సమాచారాన్ని దొంగిలించిందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధక్షుడు శివసేనారెడ్డి ఆరోపించారు. ఒక నెంబర్ నుంచి దుష్ప్రచారం జరిగితే ఆ వ్యక్తి ఎవరన్నది తెలుసుకోవాలని, తమ కంప్యూటర్‌లను ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. వార్ రూమ్‌లో అన్ని జిల్లాల యూత్ కాంగ్రెస్ కమిటీల సమాచారం ఉందని, దానిని ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపించారు. మరోవైపు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా పెట్టిన పోస్టింగుల కోసం వినియోగించిన సిమ్‌కార్డు నెంబర్ ఏపీకి చెందినది కావడంతోనే దర్యాప్తులో జాప్యం జరిగిందని సైబర్ పోలీసులు చెబుతున్నారు. వార్‌రూమ్ ఇన్‌చార్జి ప్రశాంత్‌ను విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చారు. మరోవైపు సొంత పార్టీ నేతలపై యూత్ కాంగ్రెస్ ఆధ?వర్యంలో దుష్ప్రచారం చేయడానికి కారణం ఏమిటనే చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. సైబర్ పోలీసులు వార్ రూమ్ ఇంఛార్జిని అరెస్ట్ చేయడంతో జరిగిన పరిణామాలను కాంగ్రెస్ పార్టీ పెద్దలకు నాయకులు నివేదిక ఇవ్వడంతో ప్రశాంత్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

# టీబీజేపీలో మళ్లీ మార్పు ముచ్చట్లు

హైదరాబాద్, మే 18, :కర్ణాటక ఎన్నికల ఫలితాల తరవాత తెలంగాణ బీజేపీలో అంతర్గతంగా ఏదో జరుగుతోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ మూడు రోజుల పాటు ఢిల్లీలో మకాం వేసి కీలక నేతలతో సమావేశం అయ్యారు. అయితే ఈ విషయం చివరి వరకూ వెలుగులోకి రాలేదు. వెలుగులోకి వచ్చిన తర్వాత బీజేపీలో అంతర్గత రాజకీయం క్లైమాక్స్‌కు వచ్చిందన్న ప్రచారం ఆరంభమయింది. బండి సంజయ్‌ను కూడా హైకమాండ్ ఢిల్లీ పిలిపించిందన్న ప్రచారం ప్రారంభమయింది. అయితే బండి సంజయ్ మాత్రం తనకు ఢిల్లీ నుంచి ఎలాంటి పిలుపు రాలేదని స్పష్టం చేశారు. రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తి వేయాలని ఇప్పటికే కేంద్రనాయకత్వాన్ని కోరామన్నారు. బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడిగా ఉండటంపై ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన కొంత మంతి కీలక నేతలు అసంతృప్తిగా ఉ న్నారన్న ప్రచారం కొంత కాలంగాసాగుతోంది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని మార్చాల్సిందేనని నేతలు పట్టుబడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. హస్తినకు వెళ్లిన ఈటెల రాజేందర్ ఇదే విషయంపై చర్చించారన ?చెబుతున్నారు. మునుగోడు ఉపఎన్నిక తరవాత నుండే నేతలు అసంతృప్తితో ఉన్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. మునుగోడు ఉపఎన్నిక తరవాత పార్టీలో ఎవ్వరూ చేరకపోవడానికి కారణం కూడా అదేనని చెబుతున్నారు. పార్టీలో చేరినప్పుడు యాక్టివ్ గా కనిపించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు పెద్దగా కనిపించడం లేదు. పార్టీకి, బండి సంజయ్ కి అంటీ ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మరోవైపు ఈటల రాజేందర్, వివేక్ కూడా బండి సంజయ్ పై తీవ్ర అసహనంతో ఉన్నారని చెబుతున్నారు. బీఆర్ఎస్ సస్పెండ్ చేసిన పొంగులేటితో కూడా బీజేపీ చేరికల కమిటీ నేతలు చర్చలు జరిపారు. అప్పట్లో బండి సంజయ్.. ఇలా పొంగులేటితో చర్చలకు వెళ్తున్నట్లుగా తనకు తెలియదని ప్రకటించడం ఆ పార్టీలో విభేధాల్ని బయట పెట్టినట్లయింది కర్ణాటక ఎన్నికల తర్వాత పరిస్థితిని మరింత లోతుగా అధ్యయనం చేస్తున్న బీజేపీ హైకమాండ్.. తెలంగాణ విషయంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నరు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో బండి సంజయ్‌కు మినహా ఇతర నేతలకు ఎక్కడా ప్రాధాన్యం లభించడం లేదని.. సీనియర్లు మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే తమను పక్కన పెడుతున్నారని కొంత మంది ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఇతర పార్టీల నుంచి వచ్చే సీనియర్ నేతలను చేర్చుకోవాలంటే వారికి కొంత భరోసా ఇవ్వాల్సి ఉంటుందని.. అందు కోసం కొన్ని చర్యలు తీసుకోవాలని ఈటల వంటి వాళ్లు ప్రతిపాదిస్తున్నట్లుగా చెబుతున్నారు. దీనిపై హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వరుస సమావేశాలతో కేసీఆర్ బిజీబిజీ

హైదరాబాద్, మే 18, :కొద్దీ రోజుల గ్యాప్‌లోనే గులాబీ బాస్, ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు(కేసీఆర్) వరుస సమావేశాలపై పార్టీ నాయకులతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి పెంచారు. మొన్నటి సమావేశంలోనే రాబోయే ఎన్నికలపై పార్టీ శ్రేణులకు క్లారిటీ ఇచ్చిన సీఎం కేసీఆర్, మూడు వారాల్లోనే మళ్లీ బీఆర్ఎస్ పార్లమెంటరీ, లెజిస్లేచర్ పార్టీ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహమే ఎజెండాగా సాగిందీ ఈ మీటింగ్. పోయిన మీటింగ్‌లోనే ఆర్నెల్లలో ఎన్నికలని గుర్తుచేసిన సీఎం కేసీఆర్..ఈసారి బీ రెడీ అంటూ అందరినీ అలర్ట్ చేశారు గులాబీ దళపతి.తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 6నెల్లలో ఎన్నికలు ఉ న్నాయని, ఎన్నికల షెడ్యూల్ తీసేస్తే మిగిలేది 5 నెలల సమయమే ఉందని కేడర్‌కి గుర్తు చేశారు. నేతలు పూర్తిస్థాయిలో నియోజకవర్గాలకు పరిమితం కావాలన్నారు. తెలంగాణ తెచ్చింది మనమే,అభివృద్ధి చేసింది మనమేనన్నారు. మళ్లీ మూడు వారాల్లోనే ఎమ్మెల్యే, ఎంఎల్‌సీ, ఎంపీలతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహమే ఎజెండాగా సాగిందీ మీటింగ్‌ఈ దశాబ్ధకాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గుర్తుచేస్తూ ప్రజలతో కలిసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు సీఎం కేసీఆర్. సర్వేలన్నీ సానుకూలంగా ఉన్నాయన్న సీఎం కేసీఆర్.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా 95 నుంచి 105 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దంలో శతాబ్ది అభివృద్ధి చేశామన్న సీఎం కేసీఆర్ ఇచ్చిన కొత్త స్లోగన్‌తో ప్రజల్లోకి వెళ్తామన్నారు మంత్రి జగదీశ్‌రెడ్డి. కర్నాటకలో బీజేపీ చతికిలబడిందని, మరో దారిలేక ప్రజలు అక్కడ కాంగ్రెస్‌కు ఓటేశారని విమర్శించారు.దశాబ్ధకాలం ఉత్సవాలను పండుగలా జరుపుతామన్నారు మంత్రి మల్లారెడ్డి. సర్వేల ప్రకారం 103 సీట్లు వస్తాయని, మూడోసారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. మొత్తానికి బీజేపీపై ఇప్పటికే గురిపెట్టిన గులాబీబాస్ కర్నాటక ఫలితాలతో ప్రత్యర్థులకు ఎక్కడా అవకాశం ఇవ్వొద్దని దిశానిర్దేశం చేశారు. ఓ పక్క బీజేపీ మరోవైపు కాంగ్రెస్.. విజయంపై ఆ రెండు పార్టీలు ఆశలు పెట్టుకున్న టైంలో హ్యాట్రిక్ విక్టరీ కోసం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు కేసీఆర్.



# మళ్ళపూర్ లో వ్యక్తి సూసైడ్



మల్లాపూర్, మే 18 ,: ఉ రేసుకుని ఓ వ్యక్తి గురువారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లాపూర్ మండలం మొగిలిపేట శివారు ప్రాంతంలో మండల కేంద్రానికి చెందిన పసునూరి వెంకటస్వామి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నవీన్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరాలు తెలియాల్సి ఉంది అని తెలిపారు.

## డైరెక్టర్ లోకేష్‌తో రజనీకాంత్ చివరి సినిమా!



గత కొన్నాళ్లుగా సూపర్ స్టార్ రజనీకాంత్ చివరి సినిమా హాట్ టాపిక్ గా మారింది. కాలా నుండి, సూపర్ స్టార్ యొక్క ప్రతి చిత్రం అతని చివరిది అని పుకార్లు వస్తూనే ఉన్నాయి. కానీ రజనీ మాత్రం చేతినిండా సినిమాల్లో నటిస్తూనే ఉన్నారు. తలైవర్ తదుపరి 169వ చిత్రం జైలర్ మరియు అతని 170వ చిత్రం, %ుజీ% జ్ఞానవేల్ దర్శకత్వంలో మరియు అతని కుమార్తె ఐశ్వర్య యొక్క లాల్ సలామ్‌లో పవర్ ప్యాక్డ్ అతిధి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పుడు, తాజా ఇంటర్వ్యూలో, ప్రఖ్యాత తమిళ దర్శకుడు మిస్కిన్ తన వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చాడు.రజనీకాంత్ తన 171వ చిత్రం కోసం విక్రమ్, లియో చిత్రాల దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో జతకట్టనున్నారు. 5 దశాబ్దాల పాటు సాగిన రజనీ కెరీర్‌లో తలైవర్ 171 చివరి సినిమా లోకేష్ తో అని మిస్కిన్ వెల్లడించారు. రజనీకాంత్ స్వయంగా లోకేష్‌ని సంప్రదించారని, ఆయనతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపారని మిస్కిన్ చెప్పారు. సరే, తలైవర్171 సూపర్‌స్టార్ చివరిది అవుతుందా లేదా, అయితే రజనీ – లోకేష్ కలయిక వారి అభిమానులను థ్రిల్ చేయడం ఖాయం.

## "టైగర్ నాగేశ్వరరావు" కోసం మోలీవుడ్ యంగ్ స్టార్.!

ప్రస్తుతం మాస్ మహారాజ రవితేజ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా "టైగర్ నాగేశ్వరరావు" కోసం అందరికీ తెలిసిందే. దర్శకుడు మహేష్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా అయితే భారీ హంగులతో రాబోతుంది. ఇక మేకర్స్ అయితే సినిమా ఫస్ట్ లుక్ కె సాలిడ్ ప్లానింగ్స్ చేస్తుండగా నిన్ననే ఈ సినిమా కన్నడ ఫస్ట్ లుక్ ని అయితే స్టార్ హీరో శివ రాజ్ కుమార్ తో లాంచ్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు.ఇక ఇప్పుడు అయితే ఈ సినిమా మళయాళ లుక్ కి సంబంధించి అయితే అక్కడి యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో మన రామ్.. దుల్కర్ సల్మాన్ అయితే తన వాయిస్ ఓవర్ లో పరిచయం చేయనున్నట్టుగా మేకర్స్ ఇప్పుడు కన్ఫర్మ్ చేశారు. మొత్తానికి అయితే ఒకో భాష నుంచి ఒకో స్టార్ నటునితో సాలిడ్ ప్లానింగ్ ని మేకర్స్ చేస్తున్నారు. ఇక ఇతర భాషలకి సంబంధించి అప్డేట్స్ రానున్నాయి.




## రష్మికని నేను అలా అనలేదు బాబోయ్



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ఐశ్వర్య రాజేష్ పై విమర్శలు చేస్తున్నారు. నీవెంత నీ స్థాయి ఎంత అంటూ రష్మిక అభిమానులు ఓ రేంజ్ లో సోషల్ మీడియా ద్వారా ఐశ్వర్య రాజేష్ పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దాంతో ఐశ్వర్య రాజేష్ టీమ్ నుండి ఒక స్పష్టత వచ్చింది. ఈ సంఘటన పూర్తి వివరాల్లోకి వెళ్తే... వరుసగా లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్న ఐశ్వర్య రాజేష్ త్వరలో ఫర్హాన అనే సినిమాను చేసింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా హైదరాబాద్ లో ఒక మీడియా సమావేశంలో ఐశ్వర్య రాజేష్ పాల్గొంది. ఆ సందర్భంగా ఐశ్వర్య రాజేష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి.ఫర్హాన సినిమా ప్రమోషన్ లో భాగంగా మీడియాతో మాట్లాడిన సందర్భంగా పుష్ప సినిమాలోని శ్రీవల్లి పాత్రకు తాను బాగా సెట్ అవుతాను అని నా అభిప్రాయం అన్నట్లుగా ఐశ్వర్య రాజేష్ వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలను కొందరు కావాలని పుష్ప సినిమా లో రష్మిక కంటే కూడా తాను బాగా చేసేదాన్ని అంటూ వ్యాఖ్యలు చేసింది అంటూ ఐశ్వర్య రాజేష్ ను టార్గెట్ చేయడం జరిగింది. నిజంగానే రష్మికని ఐశ్వర్య రాజేష్ అంతటి మాట అనేసిందా అంటూ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఐశ్వర్య రాజేష్ పై ట్రోల్స్ చేయడం మొదలు పెట్టారు. దాంతో ఐశ్వర్య రాజేష్ టీమ్ నుండి ఒక నోట్ వచ్చింది. అందులో ఐశ్వర్య రాజేష్ ఆ మీడియా సమావేశంలో అసలు రష్మిక మందన్నా ను అవమానించినట్లుగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పుష్ప లోని శ్రీవల్లి పాత్ర తనకు బాగా సెట్ అవుతుందని భావించింది కానీ అంతకు మించి ఏమీ లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. రష్మిక మందన్నా ను అవమానించినట్లుగా ఎలా అవుతుందని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. కొందరు కావాలని ఐశ్వర్య రాజేష్ ను టార్గెట్ చేస్తున్నట్లుగా అనిపిస్తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వివాదం విషయంలో మరీ ఆలస్యం చేయకుండా ఐశ్వర్య రాజేష్ టీమ్ నుంచి క్లారిటీ రావడంతో మరింత దూరం ఈ గొడవ వెళ్లకుండా ఉ ఒడి పోయింది అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో రష్మిక మందన్నా అభిమానుల ట్రోల్స్ ఇకనైనా ఆగుతాయేమో చూడాలి.

## గొప్ప తల్లిగా నిలిచి వారికి సరైన సమాధానం చెప్తాను

బాలీవుడ్ హీరోయిన్స్ పెళ్లి అయిన తర్వాత... పిల్లలు అయిన తర్వాత కూడా హీరోయిన్స్ గా కొనసాగుతున్నారు.. సక్సెస్ లను దక్కించుకుంటూ టాప్ స్టార్ హీరోయిన్స్ గా నిలుస్తున్నారు. కానీ సౌత్ లో మాత్రం పెళ్లి అయిన హీరోయిన్స్ ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఫిల్మ్ మేకర్స్ మాత్రమే కాకుండా ప్రేక్షకులు కూడా పెళ్లి అయిన హీరోయిన్స్ విషయంలో లైట్ తీసుకుంటున్నారు.ఒకప్పుడు పెళ్లి అయితే సౌత్ సినిమాల్లో హీరోయిన్స్ కనిపించే వారు కాదు. కానీ ఈమధ్య కాలంలో పరిస్థితి మెల్ల మెల్లగా మారుతోంది. కరోనా సమయంలో పెళ్లి చేసుకుని తల్లిగా కూడా అయిన కాజల్ అగర్వాల్ ప్రస్తుతం సినిమా ల్లో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అయ్యింది. ఇండియన్ 2 సినిమా లో నటిస్తున్న కాజల్ అగర్వాల్ మరో వైపు బాలయ్య సినిమాలో కూడా నటిస్తోంది.వరుసగా సినిమాల్లో నటిస్తున్న కాజల్ అగర్వాల్ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలతో ఒకానొక సమయంలో చాలా బాధ పడ్డట్లుగా చెప్పుకొచ్చింది. ప్రెగ్నెంట్ గా ఉన్న సమయంలో తన బాడీ షేమింగ్స్ పై ట్రోల్స్ వచ్చాయి. ఇప్పుడు హీరోయిన్ గా నటిస్తున్న సమయంలో కొందరు తనను విమర్శిస్తున్నారు అంటూ కాజల్ అగర్వాల్ ఆవేదన వ్యక్తం చేసింది.కొడుకు భవిష్యత్తు గురించి ఆలోచించకుండా... తల్లిగా విధులు నిర్వర్తించకుండా ఎందుకు మీరు సినిమాల్లో నటించాలి అనుకుంటున్నారు అంటూ విమర్శలు వస్తున్నాయి.వారికి కాజల్ అగర్వాల్ సమాధానం ఇచ్చింది. తాను భవిష్యత్తులో గొప్ప తల్లిగా నిలిచి వారికి సరైన సమాధానం ఇస్తానంటూ కాజల్ పేర్కొంది.తల్లిగా నా బిడ్డకు గొప్ప భవిష్యత్తుని ఎలా ఇవ్వాలో నాకు తెలుసు. అందుకోసం నేను ఏం చేయాలో అదే చేస్తాను. ఎవరో ఏదో అన్నారని నేను బాధ పడను అంటూ కాజల్ అగర్వాల్ సన్నిహితుల వద్ద చెప్పుకొచ్చింది. కెరీర్ కి ఎంత ప్రాముఖ్యతను ఇస్తానో ఫ్యామిలీకి అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యత ను ఇస్తానంటూ కాజల్ చెప్పుకొచ్చింది.



## పుష్పపై ఆ హీరో రివేంజ్ గట్టిగానే

లెక్కల మాస్టారు సుకుమార్ దర్శకత్వంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన చిత్రమే 'పుష్ప ది రైజ్'. గంధపు చెక్కల స్మగ్లింగ్ నేపథ్యంతో రూపొందిన ఈ మూవీ ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం ప్రభావాన్ని చూపించింది. అంతేకాదు ఈ మూవీతో బన్నీ ఏకంగా పాన్ ఇండియా స్టార్ గా ఎదిగిపోయాడు.మొదటి భాగం సూపర్ హిట్ అవడంతో ఇప్పుడు దీనికి సీక్వెల్ గా 'పుష్ప ది రూల్' మూవీని రూపొందిస్తోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో



శరవేగంగా సాగుతోంది. అక్కడ ప్రస్తుత షెడ్యూల్లో కొన్ని యాక్షన్ సీక్వెన్సులతో పాటు కీలకమైన ఛేజింగ్స్ సీన్స్ను రూపొందిస్తోన్నారు.సూపర్ హిట్ కాంబినేషన్లో రాబోతున్న 'పుష్ప ది రూల్' మూవీలో ప్రధానంగా ఫహాద్ ఫాజిల్ చేస్తోన్న భన్వర్ సింగ్ శెకావత్ పాత్రను హైలైట్ చేయబోతున్నారు. మొదటి భాగంలో పుష్పరాజ్ అతడికి వార్నింగ్ ఇవ్వడంతో.. రెండో భాగంలో వీళ్లిద్దరి మధ్య వార్ భారీ స్థాయిలో జరగబోతుంది. ప్రస్తుతం జరుగుతోన్న భారీ షెడ్యూల్లో బన్నీ – ఫహాద్ మధ్య సన్నివేశాలను చిత్రీకరించారు.ఇక తాజా షెడ్యూల్లో ఫహాద్ ఫాజిల్ తన పార్టును పూర్తి చేసుకున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు ట్విట్టర్లో ఓ ఫొటోను షేర్ చేసింది.ఇందులో అతడితో పాటు సుకుమార్ కనిపిస్తోన్నాడు. ఇక దీనికి 'పుష్పరాజ్ ను వేటాడేందుకు భన్వర్ సింగ్ శెకావత్ వర్క్ చేస్తున్నాడు. పుష్ప 2లో ఫహాద్ కీలక పార్టును పూర్తి చేసుకున్నారు. ఈ సారి పుష్ప – శెకావత్ మధ్య వార్ ను చూసేందుకు వేచి చూడలేకపోతున్నాం' అని చెప్పుకొచ్చారు. క్రేజీ కాంబినేషన్లో రాబోతున్న 'పుష్ప ది రూల్' మూవీ పై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే దీన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తోన్నారు. ఇందులో మొదటి భాగం కంటే హై రేంజ్ యాక్షన్ సీక్వెన్స్ లు ఛేజింగ్ సీన్స్ ఉంటాయని తెలిసింది. ఇక ఇటీవలే విడుదలైన ఈ మూవీ గ్లింప్స్ వీడియోకు భారీ స్థాయిలో రెస్పాన్స్ వచ్చింది.

## సెన్సేషల్ "విరూపాక్ష"..100 కోట్ల క్లబ్ లోకి.!




మెగా సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ హీరోగా యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ సంయుక్త మీనన్ కాంబినేషన్ లో దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కించిన లేటెస్ట్ చిత్రం "విరూపాక్ష" కోసం తెలిసిందే. ఈ ఏడాది టాలీవుడ్ నుంచి వచ్చిన బిగ్గెస్ట్ హిట్స్ లో ఒకటిగా ఈ చిత్రం నిలవడమే కాకుండా సాయి ధరమ్ తేజ్ కెరీర్ లో బిగ్గెస్ట్ గ్రాసర్ గా అయితే ఈ చిత్రం నిలిచింది.ఇక ఈ చిత్రం అయితే సెన్సేషనల్ మార్క్ 100 కోట్ల గ్రాస్ క్లబ్ లో అయితే చేరినట్టుగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. దీనితో సాయి ధరమ్ తేజ్ తన కెరీర్ లో మొదటి 100 కోట్ల సినిమా అయ్యితే అందుకున్నాడు. అలాగే దర్శకుని కెరీర్ లో కూడా ఈ చిత్రం మొదటి 100 కోట్ల గ్రాసర్ గా అయితే నిలిచింది. ఇక ఈ చిత్రానికి అజనీష్ లోకనాథ్ సంగీతం అందించగా బి వి ఎస్ ఎన్ ప్రసాద్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే.

దేశంలో ఏ సంస్థ కూడా ఇవ్వని అవకాశం మీ కోసం

SNEHA MACS Ltd. Ph : 040-23233989
"THE SNEHA MUTUALLY AIDED CO-OPERATIVE THRIFT AND CREDIT SOCIETY LIMITED."
Regd. No. TS/DCO/HYD/MACS/2017/314Dt 30th May 2017

SNEHA GROUP OF ORGANISATIONS SNEHA CLUB 20 YEARS CELEBRATIONS

స్నేహ పెన్షన్ స్కీమ్ లో
చేరండి ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

01 జనవరి 2021 నుండి
7 సం॥ల పాటు డిపాజిట్ చేసిన వారికి
డబుల్ ఎమౌంట్ ఇవ్వబడును.

సంవత్సరానికి 11% వడ్డీ ఇవ్వబడును
మీ డిపాజిట్ పై లభించే వడ్డీ

| | |
|---|---|
| రూ. 1,00,000/- | రూ. 11,000/- |
| రూ. 5,00,000/- | రూ. 55,000/- |
| రూ. 10,00,000/- | రూ. 1,10,000/- |

*షరతులు వర్తిస్తాయి
మీ మనవళ్ళకు మరియు మనవరాళ్ళకు
చదువుకు, పెళ్ళి కోసం కానుకగా
మీ డిపాజిట్ 7 సం॥కే రెట్టింపు (Double)

డాక్టర్ కె. శివ భాగ్యారావు IRS, VRS
ఛైర్మన్

ఎస్. రామకృష్ణ
మాక్స్ ప్రెసిడెంట్
9133312134

రండీ...! త్వర పడండీ...!

Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989